


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | మంగళవారం 03-06-2025 | సంపుటి - 24 | సంచిక - 32 | రూ : 4 | పేజీలు: 8


# రేపే ఐపీఎల్ ఫైనల్.. వాన గండం ఉందన్న వాతావరణ శాఖ

- ఐపీఎల్ 2025 ఫైనల్‌కు వరుణుడు అడ్డుతగిలే అవకాశం
- అహ్మదాబాద్‌లో రేపు ఆర్సీబీ, పంజాబ్ కింగ్స్ మధ్య తుది సమరం
- వాతావరణ శాఖ ప్రకటనతో క్రికెట్ అభిమానుల్లో ఆందోళన



ఐపీఎల్ 2025 సీజన్ తుది అంకానికి చేరుకుంది. క్రికెట్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఫైనల్ సమరానికి రంగం సిద్ధమైంది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా రేపు (జూన్ 3) రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, పంజాబ్ కింగ్స్ జట్లు టైటిల్ కోసం తలపడనున్నాయి. విశేషమేమిటంటే, ఈ రెండు జట్లలో ఏది గెలిచినా ఐపీఎల్ చరిత్రలో కొత్త ఛాంపియన్ అవతరించడం ఖాయం. అయితే, ఈ కీలక పోరుకు వరుణుడు అడ్డంకిగా మారే సూచనలు కనిపిస్తుండటంతో అభిమానుల్లో ఆందోళన మొదలైంది. అహ్మదాబాద్ వాతావరణ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం, ఫైనల్ మ్యాచ్ జరిగే మంగళవారం నాడు ఆకాశం రోజంతా మేఘావృతమై ఉండే అవకాశం ఉంది.

తరువాయి 2లో



## మంగళగిరిలో త్వరలోనే
# రెండో దశ ఇళ్ల పట్టాల పంపిణీ...

* ఉండవల్లి నివాసంలో అధికారులతో మంత్రి నారా లోకేశ్ సమావేశం
* ఏడాది కాలంలో చేపట్టిన అనేక అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష
* భూగర్భ డ్రైనేజీ, వాటర్, గ్యాస్, పవర్ ప్రాజెక్టులకు నిధుల సమీకరణపై చర్చ
* పీఎం సూర్య ఘర్ పథకం అమలుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్న లోకేశ్

మంగళగిరి నియోజకవకర్గంలో త్వరితగతిన రెండో దశ ఇళ్ల పట్టాల పంపిణీకి అవసరమైన చర్యలు చేపట్టాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. మంగళగిరి నియోజకవర్గ వ్యాప్తంగా ఏడాది

తరువాయి 2లో

## ప్రజల ఆకాంక్షలే మా అజెండా..
# వ్యవస్థల ప్రక్షాళనే ధ్యేయం

- రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమన్న సీఎం రేవంత్
- పదేళ్లలో నిర్లక్ష్యానికి గురైన వ్యవస్థలను చక్కదిద్దుతున్నామన్న ముఖ్యమంత్రి
- మహిళలకు క్యూఆర్ కోడ్‌తో ఉచిత వైద్య పరీక్షల పథకం ప్రకటన
- కోటి మందిని కోటీశ్వరులను చేయడమే లక్ష్యమన్న రేవంత్



రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడమే తమ ప్రభుత్వ ప్రధాన అజెండా అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. తాము అధికార పగ్గాలు చేపట్టే సమయానికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ తీవ్ర గందరగోళంలో ఉందని, గత పదేళ్లలో నిర్లక్ష్యానికి గురైన అనేక కీలక వ్యవస్థలను ప్రస్తుతం చక్కదిద్దే పనిలో నిమగ్నమయ్యామని తెలిపారు. ఈరోజు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా

తరువాయి 2లో

## విపత్తు నిర్వహణకు
# స్పేస్ టెక్నాలజీ సాయం..

## సీఎం చంద్రబాబు సమక్షంలో ఇస్రో-ఆర్టీజీఎస్ ఒప్పందం

- ఐదేళ్ల పాటు ఒప్పందం
- AWARE ప్లాట్‌ఫామ్‌ను మరింతగా అభివృద్ధి
- 42కి పైగా అప్లికేషన్లలో పనిచేయనున్న టెక్నాలజీ




ప్రభుత్వ పాలనలో స్పేస్ టెక్నాలజీని విస్తృతంగా వినియోగించుకునేలా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగువేసింది. ఇందులో భాగంగా సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ఇస్రో ఆర్టీజీఎస్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఐదేళ్ల పాటు సాగే ఈ ఒప్పందం ద్వారా శాటిలైట్ చిత్రాలు, శాస్త్రీయ సమాచారంతో AWARE ప్లాట్‌ఫామ్‌ను మరింతగా అభివృద్ధి చేయనున్నారు. ఇది వ్యవసాయం, వాతావరణం, విపత్తుల నిర్వహణ, పట్టణ ప్రణాళిక తదితర విభాగాల్లో 42కి పైగా అప్లికేషన్లలో పనిచేయనుంది. ఆధునిక సాంకేతికతలను సమన్వయం

తరువాయి 2లో

# రష్యా, ఉక్రెయిన్ మధ్య కీలక ఒప్పందం

- టర్కీలోని సిరాగన్ ప్యాలెస్‌లో రష్యా, ఉక్రెయిన్ మధ్య శాంతి చర్చలు
- మరణించిన 6,000 మంది సైనికుల మృతదేహాల మార్పిడికి ఇరు దేశాలు అంగీకారం
- యుద్ధ ఖైదీల విడుదలకు కొత్త ఒప్పందం కుదిరినట్లు ఉక్రెయిన్ వెల్లడి
- మాస్కో వైమానిక స్థావరాలపై ఉక్రెయిన్ డ్రోన్ల దాడి మరుసటి రోజే ఈ భేటీ
- శాంతి ఒప్పందంపై కీలక షరతుల విషయంలో ఇరు దేశాల మధ్య ఇంకా తీవ్ర విభేదాలు

2లో





# రష్యా, ఉక్రెయిన్ మధ్య కీలక ఒప్పందం

(మొదటిపేజీ తరువాయి)

గత మూడేళ్లుగా సాగుతున్న భీకర యుద్ధానికి ముగింపు పలికే దిశగా రష్యా, ఉక్రెయిన్ ప్రతినిధుల మధ్య టర్కీ వేదికగా మరో దఫా ప్రత్యక్ష శాంతి చర్చలు జరిగాయి. సుమారు రెండు వారాల వ్యవధి తర్వాత సోమవారం నాడు టర్కీలోని సిరాగన్ ప్యాలెస్‌లో ఈ సమావేశం జరిగింది. మాస్కోలోని వైమానిక స్థావరాలే లక్ష్యంగా ఉక్రెయిన్ భారీ డ్రోన్ దాడి చేసిన మరుసటి రోజు ఈ చర్చలు జరగడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ భేటీలో కీలకమైన మానవతా అంశాలపై ఇరుపక్షాలు ఒక అంగీకారానికి వచ్చినట్లు తెలుస్తోంది.సోమవారం జరిగిన ఈ చర్చలు గంటకు పైగా సాగాయి. యుద్ధంలో మరణించిన సుమారు 6,000 మంది సైనికుల మృతదేహాలను పరస్పరం మార్చుకోవడానికి రష్యా, ఉక్రెయిన్ అంగీకరించినట్లు అధికారులు తెలిపారు. ఉక్రెయిన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి హియోర్హి టిఖీ తమ ఎంబసీ వాట్సాప్ గ్రూపులో పోస్ట్ చేసిన సమాచారం ప్రకారం, ఉక్రెయిన్ ప్రతినిధి బృందానికి ఆ దేశ రక్షణ మంత్రి రుస్టెమ్ ఉమెరోవ్ నాయకత్వం వహించారు. సమావేశం అనంతరం ఉమెరోవ్ మాట్లాడుతూ, యుద్ధ ఖైదీల (పీఓడబ్ల్యూ) మార్పిడికి సంబంధించి కొత్త ఒప్పందం కుదిరిందని, ముఖ్యంగా తీవ్రంగా గాయపడిన వారిని, యువకులను విడుదల చేయడంపై దృష్టి సారిస్తామని తెలిపారు. ఈ శాంతి చర్చలకు టర్కీ విదేశాంగ మంత్రి హకాన్ ఫిదాన్ అధ్యక్షత వహించగా, టర్కీ నిఘా సంస్థ అధికారులు కూడా సమావేశంలో పాల్గొన్నారు. మరోవైపు, లిథువేనియాలోని విల్నియస్‌లో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ మాట్లాడుతూ, "ఇరు పక్షాలు టర్కీ ద్వారా పత్రాలను మార్చుకున్నాయి. మేము మరోసారి యుద్ధ ఖైదీల విడుదలకు సిద్ధమవుతున్నాము" అని అన్నారు. అయితే, ఈ చర్చల్లో కొన్ని సానుకూల అంశాలు వెలుగులోకి వచ్చినప్పటికీ, యుద్ధాన్ని ఆపడానికి అవసరమైన కీలక షరతులపై ఇరు దేశాల ఉన్నతాధికారుల మధ్య ఇంకా తీవ్రమైన భేదాభిప్రాయాలు ఉన్నట్లు వారి ఇటీవలి ప్రకటనలు సూచిస్తున్నాయి. సుమారు 1,000 కిలోమీటర్ల పొడవునా విస్తరించి ఉన్న యుద్ధ క్షేత్రంలో భీకర పోరు కొనసాగుతూనే ఉంది. ఇరుపక్షాలు ఒకరి భూభాగాలపై మరొకరు దాడులు చేసుకుంటున్నాయి.



## ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ విగ్రహాన్ని ఎత్తుకుపోయిన నిరసనకారులు!

* **పారిస్‌లోని గ్రెవిన్ మ్యూజియం నుంచి మాక్రాన్ మైనపు విగ్రహం అపహరణ**
* **గ్రీన్‌పీస్ కార్యకర్తలు ఈ చర్యకు పాల్పడినట్లు వెల్లడి**
* **రష్యా రాయబార కార్యాలయం ముందు విగ్రహాన్ని ఉంచి నిరసన**
* **రష్యా-ఫ్రాన్స్ మధ్య సంబంధాలపై గ్రీన్‌పీస్ తీవ్ర అసంతృప్తి**
* **ఫ్రాన్స్ ద్వంద్వ వైఖరిని అవలంబిస్తోందని ఆరోపణ**
* **సుమారు రూ.36 లక్షల విలువైన విగ్రహం చోరీ**

పారిస్‌లో సోమవారం నాడు ఒక అనూహ్య ఘటన చోటుచేసుకుంది. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ మైనపు విగ్రహాన్ని నిరసనకారులు ఎత్తుకుపోయారు. పర్యావరణ పరిరక్షణ సంస్థ గ్రీన్‌పీస్ కార్యకర్తలు ఒక ప్రఖ్యాత మ్యూజియం నుంచి మాక్రాన్ విగ్రహాన్ని అపహరించారు. రష్యా, ఫ్రాన్స్ మధ్య కొనసాగుతున్న ఆర్థిక, రాజకీయ సంబంధాలపై తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ వారు ఈ చర్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. పారిస్‌లోని ప్రఖ్యాత గ్రెవిన్ మ్యూజియంలో ఈ ఘటన జరిగింది. పోలీసు వర్గాలు అందించిన సమాచారం ప్రకారం, ఇద్దరు మహిళలు, ఒక పురుషుడు సాధారణ పర్యాటకుల్లాగా మ్యూజియంలోకి ప్రవేశించారు. అనంతరం, అక్కడున్న అధ్యక్షుడు మాక్రాన్ మైనపు విగ్రహాన్ని తీసుకుని, మ్యూజియం అత్యవసర ద్వారం గుండా చాకచక్యంగా తప్పించుకున్నారు. ఈ విగ్రహం విలువ సుమారు 40,000 యూరోలు (భారత కరెన్సీలో దాదాపు రూ. 36 లక్షలు) ఉంటుందని అంచనా. అపహరించిన ఈ విగ్రహాన్ని కార్యకర్తలు ఫ్రాన్స్‌లోని రష్యా రాయబార కార్యాలయం ఎదుట ఉంచి తమ నిరసనను తెలిపారు. ఈ ఘటనపై గ్రీన్‌పీస్ ఫ్రాన్స్ విభాగం అధిపతి జీన్‌ఫ్రాంకోయిస్ జులియార్డ్ మాట్లాడుతూ, "మా దృష్టిలో, ఫ్రాన్స్ ద్వంద్వ వైఖరిని అవలంబిస్తోంది" అని వివరించారు. "ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ ఈ ద్వంద్వ ప్రమాణాలకు నిలువెత్తు నిదర్శనంగా కనిపిస్తున్నారు. ఆయన ఒకవైపు ఉక్రెయిన్‌కు మద్దతు ఇస్తున్నట్లు ప్రకటనలు చేస్తున్నారు, కానీ మరోవైపు ఫ్రెంచ్ కంపెనీలు రష్యాతో వాణిజ్యం కొనసాగించేలా ప్రోత్సహిస్తున్నారు" అని ఆయన తీవ్రంగా విమర్శించారు. 2022లో ఉక్రెయిన్‌పై రష్యా దాడి ప్రారంభమైనప్పటి నుంచి ఫ్రాన్స్ ఉక్రెయిన్‌కు ముఖ్యమైన మద్దతుదారులలో ఒకటిగా నిలిచింది. అలాంటప్పుడు, రష్యాతో వాణిజ్య ఒప్పందాలను, ఇతర సంబంధాలను తెంచుకున్న మొదటి నాయకులలో మాక్రాన్ ఒకరిగా ఉండాల్సిందని గ్రీన్‌పీస్ అభిప్రాయపడింది.




## విపత్తు నిర్వహణకు
# స్పేస్ టెక్నాలజీ సాయం..

(మొదటిపేజీ తరువాయి)

చేసి... విపత్తుల నిర్వహణలో మెరుగైన ఫలితాలు అందించి ప్రజల భద్రతకు దోహదపడుతుంది. AWARE ప్లాట్‌ఫామ్ శాటిలైట్‌లు, డ్రోన్లు, IoT పరికరాలు, సెన్సార్లు, మొబైల్ ఫోన్ల ఫీడ్, సీసీటీవీ వంటి వనరుల నుంచి డేటాను సమగ్రంగా సేకరించి ప్రజలకు SMS, WhatsApp రూపంలో తక్షణ హెచ్చరికలు, సూచనలు చేస్తుంది. ఈ ఒప్పంద ద్వారా ముఖ్యంగా విపత్తు నిర్వహణలో ప్రజలకు అత్యంత ఖచ్చితమైన సమాచారం త్వరితగతిన చేరవేసే అవకాశం లభిస్తుంది. ఇస్రో డైరెక్టర్ రాజరాజన్, ఆర్టీజీఎస్ సీఈఓ ప్రఖర్ జైన్ మధ్య జరిగిన కార్యక్రమంలో చీఫ్ సెక్రటరీ విజయానంద్, ఐటీ సెక్రటరీ కాటంనేని భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

## రేపే ఐపీఎల్ ఫైనల్..
# వాన గండం ఉందన్న వాతావరణ శాఖ

(మొదటిపేజీ తరువాయి)

"అహ్మదాబాద్ నగరం మరియు పరిసర ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసేందుకు ఆస్కారం ఉంది. ఉష్ణోగ్రత సుమారు 37 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యే అవకాశం ఉంది" అని అహ్మదాబాద్ వాతావరణ కేంద్రం డైరెక్టర్ అరుణ్‌కుమార్ దాసనే తెలిపారు. ఈ అంచనాలతో మ్యాచ్ సజావుగా సాగుతుందా లేదా అనే ఉత్కంఠ నెలకొంది. వాస్తవానికి, ఈ సీజన్ ఫైనల్‌ను తొలుత కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో నిర్వహించాలని నిర్ణయించారు. అయితే, ప్రస్తుతం అక్కడ వర్షాకాలం ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తుండటంతో చివరి నిమిషంలో వేదికను అహ్మదాబాద్‌కు మార్చారు. దురదృష్టవశాత్తూ, ఇక్కడ కూడా వర్ష భయం వెంటాడుతోంది. నిన్న పంజాబ్, ముంబై జట్ల మధ్య జరిగిన క్వాలిఫయర్ 2 మ్యాచ్ కూడా వర్షం కారణంగా సుమారు రెండు గంటలు ఆలస్యంగా ప్రారంభమైన సంగతి తెలిసిందే. అయితే, అభిమానులు మరీ అంత ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఫైనల్ మ్యాచ్‌కు నిర్వాహకులు రిజర్వ్ డేను కూడా కేటాయించారు. ఒకవేళ మంగళవారం భారీ వర్షం కురిసి ఆట పూర్తిగా రద్దయితే, మరుసటి రోజు, అంటే జూన్ 4న మ్యాచ్‌ను నిర్వహిస్తారు. అప్పటికీ వర్షం కారణంగా ఆట సాధ్యం కాకపోతే, లీగ్ దశలో పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచిన జట్టును విజేతగా ప్రకటిస్తారు.

# మంగళగిరిలో త్వరలోనే రెండో దశ ఇళ్ల పట్టాల పంపిణీ

(మొదటిపేజీ తరువాయి)

కాలంలో చేపట్టిన అనేక అభివృద్ధి కార్యక్రమాలపై ఉండవల్లి నివాసంలో మంత్రి నారా లోకేశ్ సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మంగళగిరి నియోజకవర్గంలో దశాబ్దాలుగా ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న వారికి మొదటి విడతగా సుమారు 3 వేల మందికి శాశ్వత పట్టాలు అందజేయడం జరిగింది. రెండో విడతలో 2,500 ఇళ్ల పట్టాల పంపిణీకి అవసరమైన చర్యలు తీసుకోవాలి. రైల్వే, కాలువ, అటవీ, దేవాదాయ భూముల విషయంలో నెలకొన్న సమస్యలను తర్వితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. మంగళగిరిలో యూ1, ఐ2 జోన్లు, భవన నిర్మాణ అనుమతులు సీఆర్డీయే నుంచి ఎంటీఎంసీకి బదిలీ చేసే అంశంపైనా సమావేశంలో చర్చించారు.

* **భూగర్భ డ్రైనేజీ, వాటర్, గ్యాస్, పవర్ ప్రాజెక్టులకు నిధుల సమీకరణపై చర్చ**

మంగళగిరి నియోజకవర్గంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ, స్టోమ్ వాటర్ డ్రైన్స్, తాగునీరు, అండర్ గ్రౌండ్ గ్యాస్, పవర్ ప్రాజెక్టులపైనా సమావేశంలో చర్చించారు. ఆగష్టు నాటికి ఆయా ప్రాజెక్టుల డీపీఆర్ లను పూర్తిచేసి అన్ని పనులు ఒకేసారి ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిధుల సమీకరణపై అధికారులు ఈ సందర్భంగా మంత్రికి వివరించారు. మంగళగిరి పానకాల లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం అభివృద్ధికి రూపొందించిన ప్రణాళికలపై చర్చించారు. డిజైన్స్ ను పకడ్బందీగా తయారుచేయాలని మంత్రి ఆదేశించారు.

* **పీఎం సూర్య ఘర్ పథకం అమలుకు అవసరమైన చర్యలు చేపట్టండి**

మంగళగిరి నియోజకవర్గంలో పీఎం సూర్య ఘర్ పథకం అమలుకు అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. ఈ పథకం కింద 37వేల దరఖాస్తులు వచ్చాయని అధికారులు వివరించారు. లబ్ధిదారులకు అవసరమైన రుణ సదుపాయం కోసం బ్యాంకర్లతో సమావేశం నిర్వహించాలని మంత్రి ఆదేశించారు.

* **నవంబర్ లో మంగళగిరి-తెనాలి-నారాకోడూరు రహదారి నిర్మాణ పనులు ప్రారంభం**

నిత్యం రద్దీగా ఉండే మంగళగిరితెనాలి నారాకోడూరు మధ్య రోడ్డు నిర్మాణ పనులను త్వరగా ప్రారంభించాలని మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. జులై 15 నాటికి డీపీఆర్ సిద్ధం అవుతుందని, ఈ ఏడాది నవంబర్ లో పనులు ప్రారంభించనున్నట్లు ఈ సందర్భంగా అధికారులు మంత్రికి వివరించారు. రోడ్డు నిర్మాణానికి సంబం ధించి అధికారులు రూపొందించిన వివిధ ప్రణాళికలను మంత్రి క్షుణ్ణంగా పరిశీలించారు. గుంటూరుబాపట్ల రహ దారి నిర్మాణంపైనా సమావేశంలో చర్చించడం జరిగింది. చినకాకాని ఐటీ పార్క్, మోడల్ స్కూల్ గా నిడ మర్రు ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి, మంగళగిరిలో వీవర్స్ శాల, పార్క్ ల అభివృద్ధి, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ అంశాలతో పాటు పెనుమాక, మంగళగిరి, దుగ్గిరాలలో సాంఘిక సంక్షేమ హాస్టళ్ల నిర్మాణం, నియోజకవర్గ వ్యాప్తంగా కమ్యూనిటీ భవనాలు, అంగన్ వాడీ కేంద్రాల నిర్మాణంపైనా సమావేశంలో చర్చించారు. అండగ్ వాడీ కేంద్రాల నిర్మాణాలను వేగంగా పూర్తిచేయాలని ఈ సందర్భంగా మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీఆర్డీయే కమిషనర్ కన్నబాబు, గుంటూరు ఇంఛార్జ్ కలెక్టర్ భార్గవ్ తేజ, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సిన్హా, ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాష, ఏడీసీఎల్ సీఈ ప్రభాకర్, మంగళగిరి సీపీడీసీఎల్ ఏడీఈఈ సురేష్‌బాబు, ఆర్ అండ్ బీ సీఈ శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ సీఈ ఎమ్. రాజేంద్ర ప్రసాద్, అధికారులు జేవీఆర్ రెడ్డి, భావన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల ఆకాంక్షలే మా అజెండా..
# వ్యవస్థల ప్రక్షాళనే ధ్యేయం

(మొదటిపేజీ తరువాయి)

హాజరైన సీఎం రేవంత్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, ప్రజలనుద్దేశించి ప్రసంగించారు.

**మహిళా సాధికారతకు ప్రత్యేక చర్యలు**

తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు మహిళలే మూలస్తంభాలని సీఎం అన్నారు. "కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మార్చాలనే లక్ష్యంతో పని చేస్తున్నాం. వారికి ఇప్పటికే రూ.21 వేల కోట్ల సున్నా వడ్డీ రుణాలను అందించాం. పాఠశాలల నిర్వహణ బాధ్యతలను కూడా మహిళా సంఘాలకే అప్పగించాం. రుణాలు ఇచ్చి బస్సులు కొనుగోలు చేయించి, వాటిని ఆర్టీసీకి అద్దెకు తీసుకుని మహిళా సంఘాలకు ఆదాయం కల్పిస్తున్నాం. త్వరలోనే క్యూఆర్ కోడ్ కార్డు ద్వారా మహిళలకు ఉచితంగా వైద్యపరీక్షలు చేయించే పథకాన్ని కూడా తీసుకురాబోతున్నాం" అని రేవంత్ రెడ్డి వివరించారు.

**రైతు సంక్షేమానికి అగ్ర తాంబూలం**

రైతుల సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రజా ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని ముఖ్యమంత్రి తెలిపారు. "మేం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోపే రూ. 2 లక్షల లోపు





రైతుల రుణాలను మాఫీ చేశాం. ఈ పథకం కింద రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.26 వేల కోట్లు జమ చేశాం. సన్నవడ్లు పండించిన రైతులకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందిస్తున్నాం. దీని ఫలితంగా రాష్ట్రంలో సన్న వడ్ల సాగు గణనీయంగా పెరిగింది. ప్రస్తుతం రాష్ట్రంలో రూ.2.75 లక్షల టన్నుల సన్న ధాన్యం ఉత్పత్తి అవుతోంది. రైతుల భూములపై ఎలాంటి వివాదాలు లేకుండా చేయడమే మా ప్రభుత్వ లక్ష్యం. అందుకోసమే 'భూభారతి' కార్యక్రమాన్ని తీసుకువస్తున్నాం" అని ఆయన పేర్కొన్నారు.

* **యువత, విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి**

ఉద్యోగ నియామకాల విషయంలో దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో ఉందని సీఎం అన్నారు. నిరుద్యోగుల ఆకాంక్షలను నెరవేరుస్తూ వారి విశ్వాసాన్ని చూరగొన్నామని చెప్పారు. సివిల్స్‌కు ఎంపికైన వారికి ప్రోత్సాహకంగా రూ.లక్ష అందిస్తున్నామని, విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంచేందుకు యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. "ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తున్నాం. ఇందుకోసం రూ.200 కోట్లతో భవన నిర్మాణ పనులు చేపట్టాం. గురుకుల విద్యార్థులంతా ఒకే ప్రాంగణంలో ఉండాలన్నది మా ప్రభుత్వ ఉద్దేశం" అని రేవంత్ రెడ్డి అన్నారు.

# గుమ్మడిదల భూ బాధితులకు అండగా ఉంటా: హరీష్ రావు



గుమ్మడిదల,ప్రజాస్ఫూర్తి 02: గుమ్మడిదల సర్వే నెంబర్ 109 భూమి విషయంలో న్యాయం జరిగే వరకు బాధిత రైతులకు తోడుంటానని మాజీ మంత్రి హరీష్ రావు హామీ ఇచ్చారు. రాష్ట్ర నాయకులు గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో రైతులు హరీష్ రావును కలిసి తమ సమస్యలు వివరించారు. రైతుల వేదన విన్న హరీష్ రావు వెంటనే కలెక్టర్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. గతంలో తమ ప్రభుత్వ హయాంలో ఒక్కో రైతుకు 600 గజాల భూమిని ఇవ్వాలని నిర్ణయించామని తెలిపారు.సీఎం రేవంత్ రెడ్డి సొంత జిల్లా లగచర్లలో రైతులకు పరిహారం చెల్లించి ఉద్యోగాలు ఇచ్చినట్లు, అదే తరహాలో గుమ్మడిదల రైతులకూ న్యాయం జరగాలని కలెక్టర్‌ను కోరారు.ప్రస్తుత ప్రభుత్వం పరిహారం అంశంలో గ్రామ పంచాయతీలో మూడు రెట్లు, మున్సిపల్ పరిధిలో రెండు రెట్లు ఇవ్వాలని చెబుతోందని అధికారులు వెల్లడించారు. ప్రస్తుత భూమి విలువ 7.5 లక్షల రూపాయలు కాబట్టి మున్సిపల్ ప్రాంతంగా 15 లక్షల పరిహారం ఇస్తామని చెప్పారు. అయితే రైతుల అసలు నష్టానికి ఇది సరిపోదని, తగిన పరిహారం, ఉద్యోగంతో పాటు పూర్తిస్థాయి న్యాయం జరిగే వరకు రైతుల పక్షాన పోరాటం చేస్తానని హరీష్ రావు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పటాన్ చేరు కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి రాష్ట్ర నాయకులు బాల్ రెడ్డి, మాజీ ఎంపిటిసి వెంకటేశం గౌడ్, మండల పార్టీఅధ్యక్షులు కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి, రాజేష్, నాయకులు బాలకృష్ణారెడ్డి దేవేందర్ రెడ్డి, రాజశేఖర్, మంగయ్య, మల్లేష్ గౌడ్, సదానంద రెడ్డి, సత్యనారాయణ, రవీందర్ రెడ్డి ఆంజనేయులు యాదవ్, సూర్యనారాయణ, చంద్రారెడ్డి, సుధాకర్ రెడ్డి, జయపాల్ రెడ్డి, మల్లేష్, మోహన్, బీరప్ప, నారాయణ యాదవ్, పెంటయ్య, రాజు,రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా తెలంగాణ అవిర్భావ దినోత్సవ వేడుకలు



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: తెలంగాణ రాష్ట్ర అవిర్భావ దినోత్సవాన్ని చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని జూనియర్ సివిల్ కోర్టులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చౌటుప్పల్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి మహతి వైష్ణవి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధి పథంలో ముందుకెళ్తున్న తెలంగాణ రాష్ట్రానికి ప్రతి ఒక్క పౌరుడు తోడుగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ సమయంలో జైలు జీవితం గడిపిన సీనియర్ న్యాయవాది తాడూరి పరమేష్ ను బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పడమటి మహిపాల్ రెడ్డి, కోశాధికారి జెల్ల రమేష్, లైబ్రరీ సెక్రెటరీ దేశగాని శ్రీశైలం, కార్యవర్గ సభ్యులు ఎండి ఖయ్యూంపాషా, ఏజిపి మక్తాల నరసింహ, మాజీ అధ్యక్షుడు గౌడుగు శ్రీనివాస్ గౌడ్, న్యాయవాదులు ముత్యాల సత్తిరెడ్డి, కానుగు వెంకటయ్య, పిట్టల బిక్షమయ్య, గంగాదేవి రవీందర్, చామట్ల జంగయ్య, రాఘవేంద్ర, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర సాధనలో అమరవీరుల త్యాగాలను మరవద్దు

* **93 బ్లాక్ అధ్యక్షుడు జయ్ కుమార్ గుప్తా**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనలో తమ ప్రాణాలను సైతం కోల్పోయిన అమరవీరుల త్యాగాలను ఎన్నటికీ మరువద్దని93 బ్లాక్ అధ్యక్షుడు ఎల్లకొండ జయకుమార్ గుప్తా అన్నారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం లో భాగంగా కొల్లూరు లోని కేసీఆర్ నగర్ 93 బ్లాక్ లో ఏర్పాటు చేసిన జాతీయ పతాకాన్ని బ్లాక్ సభ్యులతో కలిసి జయ కుమార్ ఆవిష్కరించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించాల్సిన బాధ్యత అధికార, ప్రతిపక్ష నేతలపై ఉందని తెలిపారు . రాష్ట్ర సాధనలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరులను స్మరించుకుంటూ వారి అడుగుజాడల్లో నడుస్తూ వారి ఆశయాలను ముందుకు తీసుకు వెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్క తెలంగాణ బిడ్డ పై ఉందని జయకుమార్ తెలిపారు . కార్యక్రమంలో 93 బ్లాక్ కు చెందిన ఫ్లాట్ ఓనర్స్ , వివిధ పార్టీల నేతలు, మహిళలు పాల్గొన్నారు.

## జిల్లా కోర్టులో తెలంగాణ ఆవిర్భవ దినోత్సవ వేడుకలు



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం కొత్తగూడెం కోర్టు ప్రాంగణంలో మువ్వన్నెల పతాకాన్ని ఇన్చార్జి ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి ఎస్. సరిత ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కె.కిరణ్ కుమార్, జూనియర్ సివిల్ జడ్జి బి. రవికుమార్, స్పెషల్ జ్యూడిషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ మెండు రాజమల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు జె. గోపికృష్ణ, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పివిడి లక్ష్మి, స్పెషల్ పీపీ నీ.నాగిరెడ్డి, న్యాయవాదులు, న్యాయశాఖ సిబ్బంది, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## జయరాజుకు రాష్ట్ర ప్రభుత్వ బహుమతి

* **పలువురి అభినందనలు**



ప్రజా స్ఫూర్తి ,భద్రాద్రి కొత్తగూడెం: తెలంగాణ ప్రజా పోరాటానికి స్ఫూర్తిని అందించిన కవి, రచయిత, గాయకుడు, ప్రకృతి తత్వవేత్త, ప్రముఖ అంబేద్కరిస్ట్, కొత్తగూడెం ప్రకృతి ఆశ్రమం వ్యవస్థాపకులు జయరాజును తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా సత్కరించి, కోటి రూపాయల నగదును అందించింది. తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన విధంగా తెలంగాణ ఉద్యమకారులకు నగదు బహుమతిని సోమవారం హైదరాబాదు పెరేడ్ గ్రౌండ్ లో జరిగిన తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘనంగా సత్కరించి నగదును అందించారు జయరాజు భద్రాద్రి , కొత్తగూడెం జిల్లాకు సింగరేణి కార్మిక ఉద్యమ నిర్మాతగా సుపరిచితులు. ఈ బహుమతిని అందుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని జయరాజుకు జాతీయ బాలోత్సవ కన్వీనర్ డా. వాసిరెడ్డి రమేష్ బాబు, తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ భద్రాద్రి జిల్లా అధ్యక్షులు.. మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సంఘం వెంకట పుల్లయ్య, సింగరేణి ఏజీఎం గోనె శ్రీకాంత్, సింగరేణి రిటైర్డ్ జిఎం. శనగ వెంకటేశ్వర్లు, కొత్తగూడెం మున్సిపల్ గ్రీన్ అంబాసిడర్ మొక్కల వెంకటయ్య, మెడికేర్ అధినేత డాక్టర్ వి ఉపేందర్ రావు, డాక్టర్ కనకరాజు, రిటైర్డ్ ప్రిన్సిపాల్ డా. బి. కృష్ణయ్య, ప్రధానమంత్రి మన్ కీ బాత్ మొక్కల రాజశేఖర్, రామవరం పరిరక్షణ సమితి అధ్యక్షులు ముస్తఫా, డాక్టర్ స్వామి, ప్రముఖ గాయకులు మేదర వెంకట ముత్యం, సింగరేణి డీజీఎం చంద్రమౌళి, ప్రముఖ పత్రిక బ్యూరో చీఫ్ తుమ్మలపల్లి ప్రసాద్, ప్రకృతి ఆశ్రమం నిర్వాహకులు కేహెచ్ ప్రసాద్, కోఆర్డినేటర్ సుగుణారావు అభినందనలు తెలియజేశారు.

## జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఘనంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు




ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు.జిల్లా ఎస్పీ ముందుగా ప్రొఫెసర్ జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి జాతీయ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా ప్రజలకు,పోలీసు అధికారులకు, సిబ్బందికి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం కోసం,రాష్ట్ర సాధన కోసం జీవితాల్ని త్యాగం చేసిన అమరవీరుల త్యాగాలు చిరస్మరనీయమని అన్నారు. ప్రశాంత వాతావరణం,శాంతి భద్రతలు అదుపులో ఉన్నప్పుడే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. అన్ని రంగాల్లోనూ దేశంలోనే తెలంగాణ రాష్ట్రం మొదటి స్థానంలో నిలిచే విధంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ జి.నరేందర్,కొత్తగూడెం డిఎస్పి రెహమాన్, డిసిఆర్బి డిఎస్పి మల్లయ్య స్వామి, ఏఆర్ డిఎస్పి సత్యనారాయణ ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్,డిసిఆర్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ఇతర పోలీస్ అధికారులు,జిల్లా పోలీస్ కార్యాలయ అధికారులు,సిబ్బంది హాజరయ్యారు.

## ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తరువాత తెలంగాణ ఎంతో అభివృద్ధి

* **ముస్తాబాద్ సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి**




ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తరువాత తెలంగాణ ఎంతో అభివృద్ధి సాధించిందని ముస్తాబాద్ సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని ముస్తాబాద్ మండల కేంద్రంలోని సెస్ కార్యాలయంలో సోమవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో తెలంగాణ అభివృద్ధి దిశలో ముందుకు సాగందని తెలిపారు. దేశానికి తెలంగాణ ఆదర్శంగా నిలుస్తుందంటే గత బిఆర్ఎస్ పాలనతోనే సాధ్యమైందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఇ విష్ణు తేజ, బిఆర్ఎస్ ముస్తాబాద్ మండల అధ్యక్షుడు భోంపల్లి సురేందర్ రావు, పట్టణ అధ్యక్షుడు ఎద్దండి నర్సింహ రెడ్డి, ముస్తాబాద్ మాజీ సర్పంచ్ నల్ల నర్సయ్య, ముస్తాబాద్ మండల యూత్ అధ్యక్షుడు శీలం స్వామి, కోడె శ్రీనివాస్, శేరయ్య, సెస్ సిబ్బంది ఉన్నారు.

## ఘనంగ రాష్ట్ర అవతరణ దినోత్సవం



జిన్నారం(గుమ్మడిదల),ప్రజాస్ఫూర్తి 02: జిన్నారం, గుమ్మడిదల మండలాలలో రాష్ట్ర అవతరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో జాతీయ జండాలు ఆవిష్కరించారు. బొల్లారంలో మాజీ కౌన్సిలర్ చంద్రారెడ్డి ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. జిన్నారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ కృష్ణకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గుమ్మడిదలలో పలు పార్టీల ఆధ్వర్యంలో ఉత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో అన్ని పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## ఐఐటీ జేఈఈ అడ్వాన్స్ లో ఎస్టీ కేటగిరీలో చౌటుప్పల్ వాసికి ఆలిండియా 78వ ర్యాంక్



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ఐఐటి జేఈఈ అడ్వాన్స్ పరీక్షల ఫలితాలు సోమవారం వచ్చాయి. చౌటుప్పల్ వాసి ఎస్టి కేటగిరిలో ఆల్ ఇండియా 78వ ర్యాంకు సాధించారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం ఎనగంటి తండా గ్రామానికి చెందిన కరెంటోతు బాలాజీ నాయక్ భాగ్యలక్ష్మిల కుమారుడు విఘ్నేష్ ఎస్టీ కేటగిరి నుంచి దేశవ్యాప్తంగా 78వ ర్యాంకు సాధించారు. వ్యవసాయ కుటుంబం నుంచి విగ్నేష్ ఆలిండియా ర్యాంకు సాధించడం పట్ల పలువురు అభినందించారు.

## ఎస్ లింగోటం యువజన కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నిక



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మండల స్వాములవారి లింగోటం గ్రామంలో సోమవారం యువజన కాంగ్రెస్ గ్రామ శాఖ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. యువజన కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షునిగా చొప్పరి సాయి కుమార్, ఉపాధ్యక్షులుగా పల్చం శివ, ప్రధాన కార్యదర్శిగా తూర్పింటి సాయికుమార్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూత్ కాంగ్రెస్ బలోపేతానికి,పార్టీ గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బీమిడి ప్రదీప్ జీ, చెన్నగోని అంజయ్య, కూర్నాల వెంకటేష్, చేవెళ్లి కృష్ణ, గంగాపురం గంగాధర్, ఎర్ర విక్రమ్, బోడిగే ఆనంద్, పల్చం పాపయ్య, బాతరాజు రాజీవ్, తూర్పింటి రమేష్, తూర్పింటి ఎల్లయ్య, ఆకుల శ్రీనివాస్, రాచకొండ నర్సింహా, గంగాపురం నరహరి, ఢిల్లీ నాగరాజురెడ్డి, బిమిడి మెగనాథ్, ఉప్పు వెంకటేష్, ఆకుల మధు, పిట్టల శ్రీను, గోద వెంకటేష్, లొడే వెంకటరమణ, రాచకొండ ప్రవీణ్, కేశెట్టి సాయి, కందగట్ల చరణ్, బోయిని కాళిదాసు, రఘు, పల్చం రాము, లక్ష్మణ్, శివ, ఉప్పు అఖిల్, చేగురి దేవేందర్, బాలగోని వర్షత్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి ఆశయాల లక్ష్యం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

* **ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జ దేవరపల్లి కీర్తి చంద్రిక రెడ్డి**

ప్రజాస్ఫూర్తి ఇల్లందు: స్థానిక ఇల్లందు కోర్టు ఆవరణంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ఇల్లందు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ కీర్తి చంద్రిక రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై తెలంగాణ తల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల ను స్మరించుకుంటూ నివాళులు అర్పించినారు. అనంతరం జరిగిన సమావేశంలో జడ్జి ప్రసంగిస్తూ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు జరుపుకోవడం గర్వంగా ఉందని ,అదేవిధంగా ఎంతో పోరాటం చేసి తెచ్చుకున్న ఈ తెలంగాణ రాష్ట్రం లో న్యాయవాదుల పాత్ర కూడా ఉంది అన్నారు.నీరు ,నిధులు , నియామకాలు అందరికీ సక్రమంగా అందాలని , విద్యార్థులకు జాబ్ నోటిఫికేషన్లు మరియు విద్య ,వైద్య సదుపాయాలు కార్పొరేట్ స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు మెరుగైన సదుపాయాలు అందించాలని అదేవిధంగా తెలంగాణ రాష్ట్రం మున్ముందు అన్ని రంగాల్లో ఇంకా అభివృద్ధి సాధించాలని బంగారు తెలంగాణ నిర్మించుకోవడమే లక్ష్యంగా అందరూ ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా



వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్జి గారితో పాటు ఇల్లందు బార్ అధ్యక్షుడు కె. ఉమామహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కీర్తి కార్తీక్,సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ టీ .ఇందిరా, సీనియర్ , జూనియర్ న్యాయవాదులు కోర్టు సిబ్బంది, పోలీస్ సిబ్బంది, న్యాయవాద గుమస్తాలు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ పాలన

*** కాంగ్రెస్ ముస్తాబాద్ మండల ఏళ్ల బాల్ రెడ్డి**

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పాలన కొనసాగిస్తుందని కాంగ్రెస్ ముస్తాబాద్ మండల ఏళ్ల బాల్ రెడ్డి అన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఏళ్ల బాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. అనంతరం అమరవీరులను స్మరిస్తూ మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ కోసం విద్యార్థులు, యువకులు, ఉద్యోగులు సబ్బండ వర్గాలు ప్రతి ఒక్కరి పోరాటాన్ని, వారి ప్రాణ త్యాగాలను చూసి చలించి ఇకపై తెలంగాణ బిడ్డలు ఎవరు కూడా ప్రత్యేక రాష్ట్రం కోసం చనిపోవద్దు అని ప్రత్యేక రాష్ట్రాన్ని ప్రకటించిన తెలంగాణ తల్లి సోనియా గాంధీకి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. తెచ్చుకున్న తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీకి అధికారం ఇస్తే గత పది సంవత్సరాలలో నియంత పాలనతో తెలంగాణను ఆగం చేసింది కేసీఆర్ అన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో నీళ్లు వాళ్ళ ఫామ్ హౌస్‌లకు, నిధులు వారి బంధువులకు, వారికి నియామకాలు వారి కుటుంబానికి దక్కించుకొని తెలంగాణ ప్రజలకు తీరని అన్యాయం చేశారు అన్నారు. గత పది సంవత్సరాలలో పత్రిక స్వేచ్ఛ లేదని, బావ ప్రకటన స్వేచ్ఛ లేదని, తెలంగాణ ప్రజల రక్తంలోనే పోరాట పటిమ, ఎదిరించే గుణం ఉన్నదని, అలాంటి తెలంగాణ ప్రజలను అణచివేసే దిశగా వారు అధికారంలోకి రాగానే ధర్నా చౌక్‌ని ఎత్తేసి ప్రశ్నించే గొంతుకలను అణగదుక్కాలని చూశారు అన్నారు. ఎన్ని నిర్బంధాలు చేసిన యావత్ తెలంగాణ ప్రజలు వారి కుట్రలను పసిగట్టి మార్పు కోరుకొని కాంగ్రెస్ పార్టీకి గత ఎన్నికల్లో అవకాశం ఇచ్చారని, తెలిపారు. ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తూ ఉద్యమకారులను గుర్తిస్తూ సబ్బండ వర్గాలకు న్యాయం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని అన్నారు. తెలంగాణ మహిళలు రాష్ట్రంలో ఎక్కడికైనా ఉచితంగా వెళ్లేందుకు ఉచిత బస్సు ప్రయాణాన్ని అందించారు. అలాగే పావలా వడ్డీలకే రుణాలు ఇచ్చి మహిళా సంఘాల ఆడబిడ్డలను బస్సులకు, పెట్రోల్ పంపులకు ఓనర్లను చేసి కోటి మంది మహిళామూర్తులను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ముందుకు వెళుతుందని అన్నారు. ప్రజా ప్రభుత్వం రైతులకు పెద్దపీట వేస్తూ ప్రభుత్వం ఏర్పడిన సంవత్సర కాలంలోనే దేశంలో ఇది వరకు ఎన్నడు ఏ ముఖ్యమంత్రి చేయని రీతిలో రెండు లక్షల రుణమాఫీ ఏకకాలంలో చేసి చరిత్ర సృష్టించారని అన్నారు. అలాగే రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి ఉచిత కరెంటు, 500 రూపాయలకే సిలిండర్ ఇస్తూ మరోవైపు హైదరాబాద్‌ను తెలంగాణను ప్రపంచ పటంలో ఉంచాలనే తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యాన్ని పెట్టుకొని అభివృద్ధి సంక్షేమ పథకాలు రెండు జోడెడ్ల లాగా ప్రజా ప్రభుత్వాన్ని పరిపాలిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి రాణి నర్సింలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## ఘనంగా కూకట్ పల్లి సిఐ ముత్తు యాదవ్ జన్మదిన వేడుకలు...

*** శుభాకాంక్షలు తెలిపిన కూకట్ పల్లి జర్నలిస్టులు..**



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : కూకట్ పల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సిఐ ముత్తు యాదవ్ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కూకట్ పల్లి నియోజకవర్గం చెందిన పలువురు నాయకులు చెందిన ప్రముఖులు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కూకట్ పల్లి జర్నలిస్టు నాయకులు తొట్ల పరమేష్ గౌడ్, నాగరాజ్ యాదవ్, నామల శ్రీకాంత్, శ్రీనివాస్ రెడ్డి, రాజు యాదవ్ , ప్రవీణ్ బంటు, తదితరులు పాల్గొన్నారు.

## పీర్జాదిగూడలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



పీర్జాదిగూడ , ప్రజాస్ఫూర్తి : పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ లలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీకార్యాలయంలో జాతీయ జెండాను మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, పార్టీ జెండాను ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి ఆవిష్కరించారు. అదేవిధంగా తెలంగాణ అమరవీరుల స్తూపం, తెలంగాణ తల్లి విగ్రహాలకు పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. మున్సిపల్ అధికారులు, సిబ్బంది,నాయకులుతో కలిసి ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ అమర వీరుల త్యాగం, ఉద్యమ నేత కేసిఆర్ అకుంఠిత దీక్ష సాహసం ఫలితంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి నేటికీ 11 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేసారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కొల్తూరి మహేష్, దొంతిరి హరిశంకర్ రెడ్డి,మధుసూదన్ రెడ్డి, సీనియర్ నాయకులు లేతాకుల రఘుపతి రెడ్డి,ఏనుగు మనోరంజన్ రెడ్డి, జావీద్, నిర్మల, ప్రభు,సతీష్,శంకర్ గౌడ్,కిరణ్,సావిత్రి, సరస్వతి,వాణి, కళ్యాణి, సరిత, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలను పరిష్కరించాలని ఎంపీ ఈటెల కు వినతి



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలోని పలు ప్రాంతాలలో ప్రజలు పలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కుత్బుల్లాపూర్ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ జెకె శేఖర్ యాదవ్ అన్నారు. సోమవారం నాంపల్లిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్ ని మర్యాదపూర్వం కలసి, నియోజకవర్గంలో ఉన్న పలు సమస్యలు వారి దృష్టికి తీసుకెళ్ళారు. దీంతో ఆయన సానుకూలంగా స్పందించి పరిష్కరించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్ రెడ్డి, గాజులరామారం డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరి , బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు



## ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు..





ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం వేడుకలను సోమవారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా ముందుగా జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఐ డి ఓ సి కార్యాలయం లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందరాన్ని స్వీకరించారు.అనంతరం కొత్తగూడెం ప్రగతి మైదానంలో రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కొత్తగూడెం శాసనసభ్యులు సాంబశివరావు, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ముందుగా అమరవీరుల స్తూపం వద్ద అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం మంత్రి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో , రాష్ట్రంలో చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలపై తన సందేశాన్ని వినిపించారు. ఈ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలు ప్రతిబింబించేలా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. అనంతరం రవాణా శాఖ, తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ, పశుసంవర్ధక శాఖ, అగ్నిమాపక శాఖ , వైద్యశాఖలు చేపడుతున్న పలు కార్యక్రమాలపై ఏర్పాటు చేసిన శకటాలు ప్రదర్శించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. నాణ్యమైన విత్తనం రైతన్నకు నేస్తం, విత్తు కొద్దీ పంట అనే నినాదంతో రైతులకు విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి మొదలుపెట్టారు. ఈ సందర్భంగా పలువురు రైతులకు వివిధ రకాల విత్తనాలను అందజేశారు. సమరయోధులను మంత్రి సన్మానించారు. వివిధ శాఖల వారు చేపడుతున్న కార్యక్రమాలపై ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ను కలెక్టర్ , ఎస్పీ పరిశీలించారు.అనంతరం ఆయన మాట్లాడుతూతెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి నేటితో పదకొండు ఏళ్ళు నిండాయని, సోమవారం రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను వైభవంగా జరుపుకుంటున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజలకు శుభాభినందనలు తెలిపారు. స్వరాష్ట్ర సాధన పోరాటంలో అసువులు బాసిన అమర వీరులందరికీ ఘనంగా నివాళులు అర్పిస్తున్నానని తెలిపారు. ఎందరెందరో అమర వీరుల త్యాగాల పునాదుల మీద ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం ఈ రోజు అన్ని రంగాల్లో దశదిశలా వెలుగులు విరజిమ్ముతుందన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని భారత దేశంలోనూ, ప్రపంచ స్థాయిలో అగ్రస్థానంలో నిలిపేందుకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రైజింగ్ 2047 విజన్ తో ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. తెలంగాణ రాష్ట్రాభివృద్ధికి ఆర్థిక, సామాజిక, పరిపాలన రంగాల్లో ఆదర్శవంతమైన లక్ష్యాలతో తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ ను రూపొందించినట్టు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఇటీవల జరిగిన నీతి అయోగ్ సమావేశంలో వెల్లడించారు. ఈ వేడుకల్లో అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, కొత్తగూడెం ఆర్డీవో మధు, తాసిల్దార్ పుల్లయ్య, అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.



## తెలంగాణ ప్రజలు ఆశించిన తెలంగాణ సాకారం అవుతుంది

*** కొత్తగూడెం శాసనసభ సభ్యులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ప్రాణ త్యాగాలతో, సబ్బండ వర్గాల పోరాటాలతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం సమగ్రంగా అభివృద్ధి సాధించి, నీళ్లు, నిధులు, నియామకాల డిమాండ్ అమలైనప్పుడే తెలంగాణ ప్రజలు ఆశించిన తెలంగాణ సాకారం అవుతుందని, ఆ దిశగా పాలకులు తమ కార్యాచరణను అమలు చేయాలని కొత్తగూడెం శాసనసభ సభ్యులు, సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. 11వ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో, బస్టాండు సెంటర్లోని అమరవీరుల స్తూపం వద్ద జాతీయ జెండాను ఎగురవేసి, తెలంగాణ ఉద్యమ అమరులకు నివాళులర్పించారు, సిపిఐ జిల్లా కార్యాలయం శేషగిరిభవన్లో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా జరిగిన సభల్లో కూనంనేని మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతానికి, ప్రజలకు జరుగుతున్న అన్యాయాన్ని గుర్తించి తొలి, మలి దశ ఉద్యమానికి కొత్తగూడెం ప్రాంతమే నాంది పలికిందని, ఇక్కడ ప్రారంభమైన ఉద్యమం ప్రతిఒక్కరిలో స్ఫూర్తిని నింపి రాష్ట్ర సాధనకు బాటలు వేసిందన్నారు. రాష్ట్రంలో నిర్బంధాలు లేని స్వేచ్ఛాయుత పాలనను ప్రజలు కోరుకుంటున్నారని, అలాంటి తెలంగాణ నిర్మాణంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాసరావు, సలిగంటి శ్రీనివాస్, జిల్లా సమితి సభ్యులు దమ్మాలపాటి శేషయ్య, వాసిరెడ్డి మురళి, కందుల భాస్కర్, కంచర్ల జమలయ్య, భూక్యా శ్రీనివాస్, రత్నకుమారి, ధనలక్ష్మి, ఎస్ కె షఫీమ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎవఫ్సీ రెస్టారెంట్ ప్రారంభం



ప్రజాస్ఫూర్తి, కాప్రా : మీర్ పేట్ హెచ్ బి కాలనీ డివిజన్ యూనియన్ బ్యాంక్ పక్కన ఎవఫ్సీ రెస్టారెంట్ ను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్, గుండారపు శ్రీనివాస్ రెడ్డిలు ముఖ్య అతిథిలుగా హాజరై ప్రారంభించారు. అనంతరం రెస్టారెంట్ యజమానులు ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కి పుష్పగుచ్చం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే యజమాని రామకృష్ణ, మురళీకృష్ణ లకు మంచి లాభాలతో వ్యాపారం సాగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వంజరి ప్రవీణ్ కరిపే, చారి, శ్రీనివాస్, హరినాథ్ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, సాయి కుమార్, దండెం నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## జేఈఈ అడ్వాన్స్డ్ ఫలితాల్లో ఎస్ఆర్, నల్గొండ కు ఆలిండియా ఉత్తమ ర్యాంకులు





ప్రజాస్ఫూర్తి , నల్గొండ రూరల్ : సోమవారం విడుదలైన జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో నల్లగొండ పట్టణం చర్లపల్లిలోని ఎస్ ఆర్ కళాశాల విద్యార్థులు ఆలిండియా స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించి విజయఢంకా మోగించారు. కళాశాలకు చెందిన సపావత్ పవన్‌కు ఆలిండియా స్థాయిలో 204 ర్యాంకు సాధించి సత్తా చాటాడు. అదే విధంగా బర్మావత్ సుమన్‌కు ఆలిండియా స్థాయిలో 1049 ర్యాంకు వరించింది. ఈ సందర్భంగా కళాశాల జోనల్ ఇన్‌చార్జి దోనాల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ అత్యుత్తమ అధ్యాపక బృందం కలిగి ఉండి క్రమశిక్షణ, ఉత్తమ విద్యాబోధన వల్లే ఈ ర్యాంకులు సాధ్యం అయ్యాయన్నారు. ఎస్ ఆర్ విద్యాసంస్థల చైర్మన్ ఏనగందుల వరదారెడ్డి, డైరెక్టర్ సంతోశ్‌రెడ్డి, సీఈఓ సురేందర్‌రెడ్డి, నల్లగొండ బ్రాంచ్ అసిస్టెంట్ జోనల్ సతీశ్‌రెడ్డి, డీన్ కిషోర్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు, ఏవో సరితా రెడ్డి అధ్యాపకులు , వర్ధన్, శ్రీను, ప్రసన్న తదితరులు విద్యార్థులను అభినందించారు.

## ఉన్నత ప్రమాణాలతో ఏర్పడిన రాష్ట్రం తెలంగాణ

**: రాచకొండ సిపి సుధీర్ బాబు**




ప్రజాస్ఫూర్తి, హైదరాబాద్ : దేశంలో ఉన్నత ప్రమాణాలు కలిగిన రాష్ట్రం తెలంగాణ రాష్ట్రమని, నాలుగు కోట్ల మంది తెలంగాణ ప్రజల ఆకాంక్ష నెరవేరిన రోజు అని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం అంబర్పేట సిఎఆర్ హెడ్ క్వార్టర్స్ లో జాతీయ పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుధీర్ బాబు మాట్లాడుతూ.. దేశంలో మెట్రోపాలిటన్ సంస్కృతి ఉన్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని పేర్కొన్నారు. హైదరాబాద్ నగరానికి ఐదు వందల సంవత్సరాల చరిత్ర ఉందని, అన్ని మతాలు, వర్గాల వారిని ఏకం చేసిన ఘనత తెలంగాణకే దక్కుతుందని అని పేర్కొన్నారు. తెలంగాణలో మహిళలకు అత్యధిక ప్రోత్సాహం ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ డిసిపి ప్రవీణ్ కుమార్ , డిసిపి ఎస్బి జి నర్సింహారెడ్డి, డీసీపీ క్రైమ్స్ అరవింద్ బాబు, ఎస్ఓటీ డీసీపీ రమణ రెడ్డి, డీసీపీ సైబర్ క్రైమ్ నాగలక్ష్మి, విమెన్ సేఫ్టీ డీసీపీ ఉషా విశ్వనాథ్, డీసీపీ అడ్మిన్ ఇందిరా, డిసిపి ట్రాఫిక్ 1 మల్లారెడ్డి, డీసీపీ ట్రాఫిక్ 2 శ్రీనివాసులు, డీసీపీ కార్ హెడ్ క్వార్టర్ శ్యామ్ సుందర్, అడిషనల్ డీసీపీలు, ఎసిపిలు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా సర్వోతోముఖాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులందరూ కలిసి పని చేద్దాం

రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రజాస్ఫూర్తి , నల్లగొండ : నల్గొండ జిల్లా సర్వోతోముఖాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులందరూ కలిసి పని చేద్దామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలలో భాగంగా సోమవారం ఆయన నల్గొండ పోలీస్ పరేడ్ మైదానంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం జిల్లా ప్రజలకిచ్చిన సందేశంలో తెలంగాణ రాష్ట్రం 11 సంవత్సరాలు పూర్తి చేసుకుని 12వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా జిల్లా, రాష్ట్ర ప్రజలందరికీ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఎంతోమంది పోరాటాల వల్ల తెలంగాణ సాధించుకోగలిగామని, తాను సైతం తెలంగాణ కోసం మంత్రి పదవికి రాజీనామా చేయడం జరిగిందన్నారు. ప్రజల భవిష్యత్తు కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నదని, ఇందులో భాగంగానే తెలంగాణ రైజింగ్ 2047 పేరున పేదల సంక్షేమం కోసం సమగ్ర పాలసీలను రూపొందించిందన్నారు. రుణమాఫీ కింద జిల్లాలో రెండు లక్షల 33,981 మంది రైతులకు రెండువేల44.8 కోట్ల రూపాయల రుణమాఫీ చేశామని, రైతు భరోసా కింద ఈ యాసంగి లో ఇప్పటివరకు 4,33543 మంది రైతులకు సుమారు 414 కోట్ల రూపాయలు ఖాతాలో జమ చేయడం జరిగిందని ,యాసంగి ధాన్యం సేకరణలో భాగంగా నల్గొండ జిల్లాలో ఐదు లక్షల 91729 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి



రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలిచామని, రైతులకు ఖాతాలలో 1210 కోట్ల రూపాయలను చెల్లింపులు చేసినట్లు చెప్పారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద భూమిలేని వ్యవసాయ కూలీలకు సాలినా 12 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేసేందుకు గాను 25603 కుటుంబాలను గుర్తించడం జరిగిందని చెప్పారు. జిల్లాలో నాలుగు లక్షల 84210 మంది కుటుంబాలకు 997 చౌక ధర దుకాణాల ద్వారా ప్రతి ఒక్కరికి ఆరు జిల్లాలో చొప్పున 8 వేల 868 మెట్రిక్ టన్నుల సన్నబియ్యాన్ని అందిస్తున్నామని తెలిపారు.ఎస్సీ వర్గీకరణతో సామాజిక న్యాయం చేసామని, పారదర్శకంగా కుల గణన నిర్వహించి 42% రిజర్వేషన్లు ఇవ్వాలని నిర్ణయించడం జరిగిందని ,యువతకు ఉపాధి కల్పించడంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా మూడు లక్షల కోట్ల పెట్టుబడులు సాధించడం జరిగిందని, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలలో భాగంగా ,నల్గొండ జిల్లాలో ప్రతి నియోజకవర్గంలో పాఠశాల ఏర్పాటు చేస్తున్నామని, నల్గొండ, మునుగోడు నియోజక వర్గాలలో ఈ పాఠశాలలకు శంకుస్థాపన కూడా చేయడం జరిగిందని, భవిత కేంద్రాలలో మౌలిక వసతులు మెరుగుపరిచేందుకు ఒక కోటి 20 లక్షలు అనుమతులు ఇచ్చామని ,అన్ని పాఠశాలలకు మూడు లక్షల 54 వేల పాఠ్య పుస్తకాలు, 6 లక్షల 20వేల నోట్ పుస్తకాలు ఇచ్చామని ,జిల్లాలో నాలుగు ఐటిఐ లను అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆరు కోట్ల 77 లక్షల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని, అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్లుగా ఆధునికరించెందుకు టాటా టెక్నాలజీతో 31 కోట్ల5 లక్షలు, ప్రభుత్వం నాలుగు కోట్ల 74 లక్షల రూపాయల అత్యాధునిక మిషనరికి ఖర్చు చేసిందని ,నల్గొండ ఐటిఐ ప్రాంగణంలో 20 కోట్ల రూపాయలతో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందని తెలిపారు .ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో భాగంగా జిల్లాలో 19698 గృహాలను కేటాయించి 16,412 గృహాలకు ఉత్తర్వులు కూడా ఇవ్వడం జరిగిందని, మొదటి విడతన 1906 గృహాలు మంజూరు చేయగా 610 గృహాలు గ్రౌండ్ అయ్యాయని తెలిపారు . ఉదయ సముద్రం లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు అందించడానికి పంప్



హౌస్ నిర్మాణం పూర్తయిందని తెలిపారు. ఇటీవల కాలంలో 37 ఎకరాలల్లో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ వైద కళాశాలను ప్రారంభించుకోవడం జరిగిందన్నారు. .కనగల్ మండలంలో ఒక కోటి 58 లక్షల రూపాయలతో నిర్మించిన నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించుకోవడం జరిగిందని, అంతేకాక దేశంలోనే మొదటిసారిగా గ్లూకోమా కంటి పరీక్షలు కనగల్లు లో ప్రారంభించడం జరిగిందన్నారు. నల్గొండ పట్టణంలో లతీఫ్ సాహెబ్ గుట్ట ,బ్రహ్మంగారిమఠం, శివాలయం గుట్ట ఘాట్ రోడ్ నిర్మాణానికి 140 కోట్ల రూపాయలు మంజూరై పనులు పురోగతిలో ఉన్నాయని ,నల్గొండ జిల్లా కలెక్టరేట్ ఆవరణలో 36 కోట్ల రూపాయలతో ఆదనపు విభాగాన్నీ నిర్మించనున్నామని, ఈ పనులు పురోగతిలో ఉన్నాయని, యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ కు వెళ్లేందుకు నామ్ రోడ్డు పనులను కలుపుతూ నాలుగో వరుసల సిసి రోడ్డు నిర్మాణానికి 236 కోట్లు మంజూరు చేయబడ్డాయని, ఇవి ప్రారంభ దశలో ఉన్నాయని, యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, ఎనిమిది వేల మంది కార్మికులు నిరంతరంగా థర్మల్ పవర్ స్టేషన్ లో పనిచేస్తున్నారని, రెండవ యూనిట్ గత ఏడాది డిసెంబర్లో ప్రారంభం కాగా, మిగతా మూడు యూనిట్ల నిర్మాణం పూర్తి చేసి విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించాలనే దృఢ సంకల్పంతో ఉన్నట్లు మంత్రి వెల్లడించారు. జిల్లాలో 86 కోట్ల 80 లక్షల రూపాయలతో 35 ఉపవిద్యుత్ కేంద్రాలు మంజూరయ్యాయని వెల్లడించారు . జిల్లా అభివృద్ధికి అందరూ సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. శాసనమండలి సభ్యులు శంకర్ నాయక్, నెల్లికంట సత్యం, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ,జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు. బాల భవన్ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. వివిధ రంగాలలో ఉత్తమ సేవలందించిన ఆరుగురికి జిల్లా కలెక్టర్ ప్రశంస పత్రాలు అందజేశారు. అభివృద్ధిని తెలిపే విధంగా శకటాల ప్రదర్శన ,స్టాల్స్ ఏర్పాటు చేయడం జరిగింది. ముందు మంత్రి క్లాక్ టవర్ సెంటర్లో ఉన్న అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్చాల నుంచి అమరులకు నివాళులర్పించారు.

## అమెరికా డలాస్ లో ఘనంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : అమెరికా డలాస్ లో జరిగిన బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ , తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో మాజీ మంత్రి కేటీఆర్ , బి ఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు డలాస్ లోని బి ఆర్ ఎస్ కుటుంబ సభ్యులందరితో కలిసి పాల్గొని మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ గంద్ర జ్యోతి తో మహిళలతో కలిసి బతుకమ్మ ఆడిన కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు.

## జేఈఈ అడ్వాన్స్డ్ ఫలితాల్లో ఎస్ఆర్, నల్గొండ కు ఆలిండియా ఉత్తమ ర్యాంకులు

ప్రజాస్ఫూర్తి , నల్గొండ రూరల్ : సోమవారం విడుదలైన జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో నల్లగొండ పట్టణం చర్లపల్లిలోని ఎస్ ఆర్ కళాశాల విద్యార్థులు ఆలిండియా స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించి విజయఢంకా మోగించారు. కళాశాలకు చెందిన సపావథ్ పవన్కు ఆలిండియా స్థాయిలో 204 ర్యాంకు సాధించి సత్తా చాటాడు. అదే విధంగా బర్మావత్ సుమన్కు ఆలిండియా స్థాయిలో 1049 ర్యాంకు వరించింది. ఈ సందర్భంగా కళాశాల జోనల్ ఇన్చార్జి దోనాల శ్రీనివాస్రెడ్డి మాట్లాడుతూ అత్యుత్తమ అధ్యాపక బృందం కలిగి ఉండి క్రమశిక్షణ, ఉత్తమ విద్యాబోధన వల్లే ఈ ర్యాంకులు సాధ్యం అయ్యాయన్నారు. ఎస్ ఆర్ విద్యాసంస్థల చైర్మన్ ఏనగందుల వరదారెడ్డి, డైరెక్టర్ సంతోశ్రెడ్డి, సీఈఓ సురేందర్రెడ్డి, నల్లగొండ బ్రాంచ్ అసిస్టెంట్ జోనల్ సతీశ్రెడ్డి, డీన్ కిషోర్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్రావు, ఏవో సరితా రెడ్డి అధ్యాపకులు , వర్ధన్, శ్రీను, ప్రసన్న తదితరులు విద్యార్థులను అభినందించారు.

## తెలంగాణ రాష్ట్రాన్ని నెం.1గా అభివృద్ధి చేసిన ఘనత బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ కే

*** బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : తెలంగాణ రాష్ట్రాన్ని నెం.1గా అభివృద్ధి చేసిన ఘనత బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ కే దక్కుతుందని బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం జంట సర్కిల్ కార్యాలయిన కుత్బుల్లాపూర్, గాజుల రామారం సర్కిల్ కార్యాలయాల్లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై మువ్వన్నెల జాతీయ జెండాను ఎగురవేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... అడుగడుగునా వివక్షకు గురైన తెలంగాణ ప్రాంతాన్ని, తెలంగాణ సమాజాన్ని ఏకం చేస్తూ ఉద్యమమే ఊపిరిగా కేంద్రంతో కొట్లాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఉప కమిషనర్లు నర్సింహా, మల్లారెడ్డి, కార్పొరేటర్లు జగన్, మంత్రి సత్యనారాయణ, హేమలతా సురేష్ రెడ్డి, ఈఈ లక్ష్మీ గణేష్, కిష్టప్ప, డీఈ లు పాపమ్మ, శిరీష, రూపాదేవి, వివిధ విభాగాల అధికారులు, స్థానిక నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## చిన్న రాష్ట్రాల ఏర్పాటు ద్వారానే అభివృద్ధి సాధ్యం

*** బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్**



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : చిన్న రాష్ట్రాల ఏర్పాటు ద్వారానే అభివృద్ధి సాధ్యమని నమ్మిన బాబా సాహెబ్ అంబేద్కర్ ఆలోచనలకు అనుగుణంగా ఏర్పడింది తెలంగాణ రాష్ట్రమని బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ అన్నారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బాలా నగర్ హెచ్ఏఎల్ కంపెనీ ఆడిటోరియంలో హిందూస్తాన్ ఏరోనాటిక్స్ వర్కర్స్ యూనియన్, వెల్ఫేర్ ఫండ్ మేనేజింగ్ కమిటీ మరియు హెచ్ఏఎల్ తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ప్రజా సంకల్పానికి, పోరాట శక్తికి నిలువెత్తు సాక్ష్యం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అని అన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలలో అడుగడుగున వివక్షకు గురైన తెలంగాణ ప్రాంతం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటే లక్ష్యంగా కొనసాగించిన ఉద్యమం ప్రజా సంకల్పానికి, పోరాట శక్తికి నిలువెత్తు సాక్ష్యమని అన్నారు. రక్షణ వ్యవస్థలలో కీలక భూమిక పోషిస్తున్న హెచ్.ఏ.ఎల్ కు ఎన్నో రాయితీలు అందించిన నాయకుడు, బిఆర్ఎస్ అధినేత , పెద్దలు కేసీఆర్ కి దక్కుతుందన్నారు. అనంతరం కార్యక్రమ నిర్వాహకులు పుష్పగుచ్చం, శాలువాతో ఎమ్మెల్యే ని సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి, ఎస్.ఎల్.ఆర్.డి.సి జనరల్ మేనేజర్ ప్రభాల్ మజుందార్, హెచ్ఏడబ్ల్యూయూ ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ బాబు, డబ్ల్యూఎఫ్ఎంసీ చైర్మన్ శ్రీహరి రావు, ఎస్.ఎల్.ఆర్.డి.సి సీడి ఎంవీ శ్రీనగేష్, హెచ్ఆర్ డీజీఎం సూర్యకాంత్ రౌత్, హెచ్ఏఎల్ టీఈఏ ప్రెసిడెంట్ సీహెచ్.రామదాసు,డబ్ల్యూఎఫ్ఎంసీ సెక్రెటరీ ఈ.జయశ్రీ, సభ్యులు చిలుక రాందాస్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బిఆర్ఎస్ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, జగద్గిరిగుట్ట డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, సుభాష్ నగర్ డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, తెలంగాణ రాష్ట్ర వడ్డెర సంఘం అధ్యక్షులు ఎత్తరి మారయ్య, యూత్ నాయకులు రమ్మీ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా 11వ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం



కుత్బుల్లాపూర్ , (ప్రజాస్ఫూర్తి) : 11వ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం ప్రగతి నగర్ లోని త్రీ మంకీస్ సర్కిల్ దగ్గర సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి , ఎన్ ఎం సి అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి లు ముఖ్యఅతిథిగా పాల్గొని జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం వీర అమరలను గుర్తు చేస్తూ వారికి నివాళులు అర్పించారు. తెలంగాణను ఇచ్చిన సోనియమ్మ కి, కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలంగాణ ప్రజల తరఫున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి షైక్ రఫీయా బేగం, ఎన్ ఎస్ సి కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు ఇందిరా, కుమార్ యాదవ్, శ్రీశైలం యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రవీణ్,నారాయణరెడ్డి, ఏలూరి సత్య (నాని), లింగాల గంగాధర్, వరగాని వాసు,విజయ్ కుమార్,మధుసూదన్ రెడ్డి,ప్రశాంత్ రెడ్డి, పంగా శ్రీనివాసరావు, మల్లికార్జున్, బికన్ షా,ప్రేమ్ కుమార్,గూడూరు మురళీ,గోలి శ్రీను,తులసీదాస్,రఫత్, ఆదిరెడ్డి, సురేంద్ర యాదవ్, వినోద్, రవీంద్ర, మహమూద్,ప్రభాకర్ రెడ్డి, రాంచందర్ నాయక్, నరసింహారెడ్డి, సాయిరాజ్,విష్ణు,పితాని శ్రీనివాసరావు, బాలకృష్ణ,లక్ష్మణ్, హరిబాబు, రఘు,ఎం శ్రీనివాస్,మహిపాల్, రామానాయుడు, కృష్ణ,శ్రీదేవి,సరితా రెడ్డి, ధనలక్ష్మి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## గత పదేళ్లలో తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదు

**: కిషన్‌రెడ్డి**



హైదరాబాద్: ఎంతో మంది ఆత్మబలిదానాలతో తెలంగాణ వచ్చిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో జరిగిన తెలంగాణ అవతరణ దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. “తెలంగాణ ఉద్యమం అహింసా పద్ధతిలో సాగింది. ఉద్యమంలో భాజపా కీలక పాత్ర పోషించింది. తెలంగాణకు అనుకూలమని అందరికంటే ముందు నిర్ణయం తీసుకున్న పార్టీ మాది. తెలంగాణ వచ్చాక నీళ్ల పేరుతో నిధుల దోపిడీ జరిగింది. తెలంగాణ వస్తే ఉద్యోగాలు వస్తాయని యువత భావించింది. కేసీఆర్ కుటుంబానికి ఉద్యోగాలు వచ్చాయి కానీ.. యువతకు రాలేదు. ఏ ఆకాంక్షల కోసం ప్రజలు పోరాడారో గత పదేళ్లలో అవి నెరవేరలేదు. మిగులు బడ్జెట్‌తో ఏర్పడిన తెలంగాణ ఇవాళ రూ.10 లక్షల కోట్ల అప్పుల్లోకి వెళ్లింది” అని కిషన్‌రెడ్డి అన్నారు.

## బోడుప్పల్ లో ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు



బోడుప్పల్, ప్రజాస్ఫూర్తి : బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం లో రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అథిదిగా మాజీ జడ్పీటీసీ పార్టీ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా సంజీవరెడ్డి రెడ్డి మాట్లాడుతూ ...60 ఏళ్ల తెలంగాణ ప్రజల కలను ఒకేఒకడుగా బయలుదేరి అలుపెరుగని పోరాటం చేసి స్వరాష్ట్రాన్ని సాధించిన ఘనత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దకుతుందన్నారు.కాంగ్రెస్ హామీలు అమలు చేసే వరకు పోరాడుతామని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ హ యాంలో అన్ని వర్గాలకు అన్యాయం జరుగుతున్నదని అన్నారు. తెలంగాణకు కాంగ్రెస్, బీజే పీలు పార్టీ ద్రోహం, దగా చేశాయన్నారు.ప్రజలు ఇప్పుడు కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నా రని తెలిపారు.. ఈ కార్యక్రమం లో పార్టీ ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ మాజీ ఎంపీటీసీలు ప్రతాప్ రెడ్డి నాగేశవ్రావు బీఆర్ఎస్ డివిజన్ ఇంచార్జి లూ డివిజన్ అధ్యక్షులు ఉద్యమ కారులు మాజీ ప్రజాప్రతినిధులు యువజన నాయుకులు పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు




కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని శేరిలింగంపల్లి నియోజకవర్గం వివేకానందనగర్ డివిజన్‌లో ఘనంగా నిర్వహించారు. మాధవరం కాలనీలో గల డివిజన్ పార్టీ కార్యాలయం , వెంకటేశ్వరనగర్ 33వ బ్లాక్ ప్రాంతాల్లో వేడుకలు జరిగాయి.ఈ కార్యక్రమాన్ని డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి తనయుడు మాధవరం కౌశిక్ రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత గొట్టిముక్కల పెద్ద భాస్కర్ రావు ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, కేక్ కట్ చేసి ఉద్యమకారులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాచర్ల భద్రయ్య, అనిల్, లక్ష్మణ్, ఆంజనేయులు, నరసింహారెడ్డి, సత్యనారాయణ, మధు, బాబు, వెంకటరెడ్డి, శ్రీనివాస్ సాగర్, రమణారెడ్డి, కొండలరావు, శ్రీనివాస్, రామచందర్, రాజేందర్, శంకర్ గౌడ్, టీ.కృష్ణ, ఎంజాల యాదయ్య, అఖిల్, వాసు, దుండగుల శ్రీనివాస్, పంతులు మల్లయ్య, సోమన్న, సోమేశ్, అరవింద్, రాములు, శైలజ, లక్ష్మీకాంతం, మాధవి రెడ్డి, నవనీత తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ముగ్గురు భారతీయులలో ఒకరు పాలను పానీయంగా వినియోగిస్తున్నారు

**: గోద్రేజ్ జెర్సీ**

హైదరాబాద్, మే 29, 2025 : ప్రపంచ పాల దినోత్సవం సందర్భంగా, గోద్రేజ్ జెర్సీ భారతీయ వినియోగదారుల ప్రాధాన్యత లను "బాటమ్స్ అప్... ఇండియా సేస్ చీర్స్ టు మిల్క్!" అనే నివేదిక విడుదల చేసింది. ప్రతి ముగ్గురు భారతీయులలో ఒకరు పాలను పానీయంగా వినియోగిస్తుండగా, హైదరాబాద్‌కు చెందిన వినియోగదారుల్లో 28 శాతం మంది పాలను పానీయంగా ఇష్టపడుతున్నారని అధ్యయనం వెల్లడిస్తుంది. దీనితో పాటుగా, 53% మంది వినియోగదారులు ఇంట్లో ఫ్లేవర్డ్ పాలు తాగడానికి లేదా తాము తాగే పాలకు అదనపు రుచిని జోడించడానికి ఇష్టపడుతున్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు పోషకమైన రిఫ్రెష్‌మెంట్ డ్రింక్ ఇవ్వడానికి అనుకూలమైన మరియు ఆనందించే మార్గంగా ఫ్లేవర్డ్ పాలను ఎక్కువగా ఎంచుకుంటున్నారు, 47% మంది పగటిపూట దీనిని అందిస్తుంటే, 40% మంది ఆటలు ఆడే సమయంలో రిఫ్రెష్ ఎంపికగా దీనిని ఉపయోగిస్తున్నారు. ఈ అధ్యయనం పై గోద్రేజ్ జెర్సీ సీఈఓ భూపేంద్ర సూరి మాట్లాడుతూ, "గోద్రేజ్ జెర్సీ వద్ద , వినియోగదారుల ప్రాధాన్యత లకు తగినట్లుగా ఉత్పత్తులను అందజేయడానికి మేము కట్టుబడి ఉన్నాము. రుచి, తాజదనం మరియు పోషణకు సమాన ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా, కొత్త తరానికి పాలు అంటే ఏమిటో బ్రాండ్ పునర్నిర్వచిస్తోంది. గోద్రేజ్ జెర్సీ బాదం మిల్క్ కేవలం రుచి పరంగా మాత్రమే కాదు,




ఇది ఆరోగ్యకరమైన, పోషకాహార ఎంపిక, ఇది ప్రపంచ పాల దినోత్సవం నాడు మాత్రమే కాకుండా ప్రతిరోజూ పాలను ఇష్టపడే పానీయంగా చేస్తుంది" అని అన్నారు. "భారతదేశం మరింత బుద్ధిపూర్వక వినియోగాన్ని స్వీకరించడంతో, పాలు చుట్టూ ఉన్న కథనం అభివృద్ధి చెందుతోంది. ఇది ఇకపై కేవలం సంప్రదాయం మాత్రమే కాదు , ఇది ఆధునిక జీవనశైలికి అనుగుణంగా ఉండే ఆవిష్కరణ ! . ఈ మార్పుకు గోద్రేజ్ జెర్సీ నాయకత్వం వహిస్తోంది, వారసత్వాన్ని తాజా ఆలోచనలతో మిళితం చేసి పాలను రోజువారీ పోషకాహారంలో ఒక విలువైన భాగంగా చేస్తుంది " అని ఆయన అన్నారు. 'బాటమ్స్ అప్... ఇండియా సేస్ చీర్స్ టు మిల్క్!' అనే శీర్షికతో జరిగిన ఈ సర్వే ఢిల్లీ, ముంబై, హైదరాబాద్ మరియు చెన్నై వంటి ప్రధాన నగరాల నుండి పాల ఉత్పత్తుల ప్రాధాన్యతలు, నాణ్యత అంచనాల పై దృష్టి సారించి పరిజ్ఞానం సేకరించింది. భవిష్యత్ వృద్ధికి ఇంధనంగా నిలిచేందుకు డెయిరీ రంగం అభివృద్ధి చెందుతున్న వినియోగదారుల డిమాండ్లకు అనుగుణంగా మారాల్సిన అవసరాన్ని, ఆవిష్కరణలను నాణ్యతతో మిళితం చేయాల్సిన అవసరాన్ని ఈ పరిశోధనలు నొక్కి చెబుతున్నాయి. ఈ సర్వేను YouGov రూపొందించింది మరియు నిర్వహించింది. గోద్రేజ్ గ్రూప్ యొక్క వైవిధ్యభరితమైన ఆహార మరియు వ్యవసాయవ్యాపార సమ్మేళనం అయిన గోద్రేజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ (GAVL) అనుబంధ సంస్థ అయిన క్రీమ్‌లైన్ డైరీ ప్రొడక్ట్స్ లిమిటెడ్, గోద్రేజ్ జెర్సీ బ్రాండ్ పేరుతో ఉత్పత్తులను విక్రయిస్తుంది

## 'జై తెలంగాణ' నినాదం ఓ పార్టీది కాదు : మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్: 'జై తెలంగాణ' రాష్ట్ర ప్రజల నినాదమని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. 'జై తెలంగాణ' నినాదంపై ఒకరు పేటెంట్ ఏమీ తీసుకోలేదన్నారు. ఇది ఓ పార్టీకి సంబంధించిన నినాదం కాదని స్పష్టం చేశారు. " కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చింది కాళేశ్వరంపై వేసిన ఓ దర్యాప్తు కమిషన్. స్వతంత్ర దర్యాప్తు కమిషన్‌ను రాజకీయంగా విమర్శించడం ఏంటి? భారాస, భాజపా కలిసి నడుస్తున్నాయని కవిత చెప్పారు. అదే మాట గతంలో మేం చెప్తే.. భారాస, భాజపా నేతలు హడావుడి చేశారు. ఆ రెండు పార్టీల మధ్య బంధాన్ని కేసీఆర్ కుమార్తె స్వయంగా చెప్పారు.



కవిత వ్యాఖ్యలపై భాజపా, భారాస నాయకులు సమాధానం చెప్పాలి." అని శ్రీధర్‌బాబు డిమాండ్ చేశారు.

## ఆగస్టు 15 నాటికి భూసమస్యలు పరిష్కరిస్తాం: పొంగులేటి

జనగామ: ఆగస్టు 15 నాటికి భూస మస్యలు పరిష్కరిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. పాలకుర్తిలో పర్యటిస్తున్న ఆయన భూసమస్యలపై మాట్లాడారు. భూభారతితో రెవెన్యూ సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. "జూన్ 3 నుంచి ఈ నెల 20 వరకు అధికారులే ప్రజల వద్దకు వస్తారు. రెవెన్యూ వ్యవస్థ గ్రామాలకు వచ్చి సమస్యలు పరిష్కరిస్తుంది. అన్ని మండలాల్లో శిక్షణ ఇచ్చిన సర్వేయర్లతో సర్వే నిర్వహిస్తాం. ఇళ్లు ఇచ్చే ప్రక్రియ నిరంతరం కొనసాగుతుంది. రాబోయే రోజుల్లో కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తాం"అని మంత్రి తెలిపారు.



## కూకట్‌పల్లిలో డ్రగ్స్ ముఠా అరెస్ట్

హైదరాబాద్: కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రగ్స్ విక్రయిస్తున్న ముఠాను ఎస్‌ఓటీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఏపీలోని అద్దంకి నుంచి వచ్చి కూకట్‌పల్లిలోని వివేకానందనగర్ కాలనీలో నిందితులు డ్రగ్స్ విక్రయిస్తున్నారు. పక్కా సమాచారంతో దాడి చేసిన పోలీసులు.. ఐదుగురు డ్రగ్ పెడ్లర్లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 800 గ్రాముల ఎపిడ్రిన్, హెరాయిన్, 5 మొబైల్ ఫోన్లు,



రూ.50వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. ముఠాలో తిరుపతికి చెందిన ఓ కానిస్టేబుల్ ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం అతడు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

## నన్ను సస్పెండ్ చేస్తే అందరి జాతకాలు బయటపెడతా: రాజాసింగ్



హైదరాబాద్: తనను అధిష్ఠానం సస్పెండ్ చేస్తే అందరి జాతకాలు బయటపెడతానంటూ భాజపా ఎమ్మెల్యే రాజాసింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయనకు నోటీసులు ఇవ్వాలని భాజపా యోచిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీనిపై సోమవారం రాజాసింగ్ స్పందించారు. నోటీసులు కాదు, కావాలంటే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలన్నారు. సస్పెండ్ చేస్తే అందరి జాతకాలు బయటపెడతానని, ఎవరి వల్ల పార్టీకి నష్టం జరిగిందనేది ప్రజల ముందుంచుతానని అన్నారు.

## కాళేశ్వరం కమిషన్ ముందుకు కేసీఆర్.. విచారణ తేదీ మార్పు

హైదరాబాద్: కాళేశ్వరం కమిషన్ ఎదుట మాజీ సీఎం కేసీఆర్ విచారణకు హాజరుకావాల్సిన తేదీ మారింది. ఈనెల 11న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ముందు ఆయన హాజరుకానున్నారు. కేసీఆర్ విజ్ఞప్తి మేరకు విచారణ తేదీని కాళేశ్వరం కమిషన్ మార్చింది. తొలుత ఈనెల 5న విచారణకు కేసీఆర్ హాజరుకావాల్సి ఉండగా.. తాజాగా 11కి మార్చారు.



## తెలంగాణను దేశంలోనే సుసంపన్నంగా నిలిపేందుకు సీఎం రేవంత్ కృషి: భట్టి విక్రమార్క

ఖమ్మం: తెలంగాణను దేశంలోనే సుసంపన్నంగా నిలిపేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఎందరో అమరవీరుల త్యాగాలతో ఏర్పడిన తెలంగాణపై దేశంలోని అన్ని రాష్ట్రాల చూపు ఉండేలా చేశామని చెప్పారు. ఖమ్మంలో నిర్వహించిన రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో భట్టి విక్రమార్క మాట్లాడారు. "తెలంగాణ ఆవిర్భవించి నేటితో 11 ఏళ్లు పూర్తయింది. రాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన అమరవీరులకు నివాళులర్పిస్తున్నాను. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మాటలను స్ఫూర్తిగా తీసుకుని యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను తీసుకొచ్చాం. కులమతాలకు అతీతంగా విద్యను అందిస్తున్నాం. మధిర నియోజకవర్గం బోనకల్ మండలాన్ని రెండో పైలట్ మండలంగా తీసుకున్నాం. రెవెన్యూ శాఖను పటిష్ఠం చేసేందుకు ప్రతి గ్రామానికి పరిపాలనాధికారిని నియమిస్తున్నాం. దేశంలో



ఏ రాష్ట్రంలో లేని విధంగా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నాం. ఆడబిడ్డల ప్రయాణ ఖర్చుల గురించి ఆలోచించి ఉచిత బస్సు సౌకర్యం కల్పించాం. గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నాం. రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్లను కేటాయించాం. ప్రస్తుత యాసంగికి బోనస్ చెల్లించనున్నాం. బాలిక పుట్టడం అదృష్టంగా భావించాలని 'మా పాప.. మా ఇంటి మణిదీపం' అనే కార్యక్రమాన్ని చేపట్టాం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థుల పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ అందిస్తున్నాం. ఖమ్మం నగరం చుట్టూ జాతీయ రహదారులు రానున్నాయి. రింగ్ రోడ్డుకు చర్యలు చేపట్టాం. మున్నేరు నదిపై తీగల వంతెన నిర్మాణం చేపడుతున్నాం" అని భట్టివిక్రమార్క వివరించారు.

## ఏపీలో అద్భుతంగా అభివృద్ధి.. తెలంగాణ వెలవెల

**: ఎంపీ ఈటల రాజేందర్**

హైదరాబాద్: తెలంగాణ ఉద్యమాన్ని కాంగ్రెస్ పార్టీ అణచివేసిందని.. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చిందని భాజపా ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మూడు తరాల ఉద్యమంలో అసువులు బాసిన విద్యార్థులకు నివాళులర్పిస్తున్నట్లు తెలిపారు. నాంపల్లిలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "తెలంగాణ మలిదశ ఉద్యమంలో అన్ని పార్టీలూ ఏకమై సంఘటితంగా పోరాటం చేశాయి. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు



భాజపా అన్ని విధాలుగా సహకరించింది. కేసీఆర్ తొమ్మిదిన్నరేళ్లలో నిరంకుశ పాలన చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్నా అమరుల కుటుంబాలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదు. భారాస పేరు చెప్పి కాంగ్రెస్ తప్పించుకుంది. తెలంగాణ కంటే ఏపీ జీడీపీ, ఆదాయం తక్కువ. ఏపీ అద్భుతంగా అభివృద్ధి చెందుతుంటే తెలంగాణ వెలవెలబోతోంది. సీఎం రేవంత్‌రెడ్డి దిల్లీకి వెళ్లి ప్రధానిని పెద్దన్న అంటారు.. గల్లీకి వచ్చి విమర్శిస్తారు. తెలంగాణ ప్రజల ఆశలను భారాస, కాంగ్రెస్ కల్లలు చేశాయి. ఇక్కడ భాజపా అధికారంలోకి రావడం ఖాయం.. అప్పుల ఊబిలో ఉన్న రాష్ట్రాన్ని గట్టెక్కించడం తథ్యం. భారాస నేత హరీశ్‌రావు, నేను ఎందుకు కలుస్తాం? ఫోన్ ట్యాపింగ్ కేసు ఏమైంది? భారాస హయాంలోని ఒక్క అవినీతి, అక్రమాలపైనైనా చర్యలు తీసుకున్నారా?" అని ఈటల ప్రశ్నించారు.

## హైదరాబాద్‌కితాక్యూషు మధ్య విమాన కనెక్టివిటీకి ప్రయత్నిస్తున్నాం

**: సీఎం రేవంత్‌రెడ్డి**

హైదరాబాద్: కితాక్యూషు నగరం ఎకో టౌన్ మోడల్‌తో చాలా ప్రేరణ పొందినట్లు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. జపాన్‌లోని కితాక్యూషు సిటీ మేయర్ కజుహిసా, జపాన్ బృందంతో ఐటీసీ కాకతీయలో సీఎం సమావేశమయ్యారు. తెలంగాణ, కితాక్యూషు పరస్పర సహకార ఒప్పందంపై చర్చలు జరిపారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. "ప్రపంచ భాగస్వామ్యంతో రాష్ట్ర పురోగతిని ముందుకు తీసుకెళ్తున్నాం. కితాక్యూషు నగర అభివృద్ధి తెలంగాణ రైజింగ్‌కు సరిపోయేలా ఉంది. తెలంగాణకితాక్యూషు సహకార ఒప్పందం జరగడం సంతోషంగా ఉంది. ప్రస్తుతం మూసీ నది అభివృద్ధి, పునరుజ్జీవన ప్రాజెక్టుపై మా దృష్టి ఉంది. రాష్ట్ర యువతకు నైపుణ్య కల్పించడం మా ప్రాధాన్యత. హైదరాబాద్‌కితాక్యూషు మధ్య విమాన కనెక్టివిటీకి ప్రయత్నిస్తున్నాం" అని



సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

## 'యువ వికాసానికి అమరుల పేర్లు పెట్టాలి'

**.. MLC కవిత డిమాండ్**

రాష్ట్ర ప్రభుత్వం సోమవారం యువ వికాసం కార్యక్రమాన్ని ప్రారంభించాలని తలపెట్టి రద్దు చేసుకుందని.. తెలంగాణతో సంబంధం లేని రాజీవ్‌గాంధీ పేరుతో కాకుండా తెలంగాణ ఉద్యమకారుల పేరుతో ఈ పథకాన్ని ప్రారంభించాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆబిడ్స్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో నిర్వహించిన యువ కెరటాలు కవి సమ్మేళనంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అర్హుల ఎంపికలో లోపాలున్నాయని కార్యక్రమ ప్రారంభాన్ని వాయిదా వేసుకున్న ప్రభుత్వం.. పథకానికి తెలంగాణ




ఉద్యమకారుల పేరు పెట్టేందుకు మాత్రం సిద్ధంగా ఉన్నట్లు కనిపించడం లేదన్నారు. తెలంగాణ తల్లి విగ్రహం రూపశిల్పి బీవీఆర్ చారి పుట్టిన రోజు, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం ఒకే రోజు కావడం సంతోషకరమన్నారు. కవులు లోపాలు ఎత్తిచూపాలి.. కవులు, సాహితీవేత్తలు పాలనలో లోపాలను ఎత్తి చూపాలని ఎమ్మెల్సీ కవిత అన్నారు. పాలకుడి స్థానంలో ఎవరున్నా కవులు, సాహితీవేత్తలు ఈ పని చేయాలని సూచించారు. తెలంగాణ గడ్డలోనే ధిక్కారం ఉంటుందని.. అదే స్థాయిలో ప్రేమ కూడా ఉంటుందని గుర్తు చేశారు. చిన్న పిల్లలు బతుకమ్మ పాటలు నేర్చుకుంటేనే తెలంగాణ సాంస్కృతిక వారసత్వం, వైభవం, విశిష్టత వందల ఏళ్లు నిలిచి ఉంటుందని తెలంగాణ జాగృతి పని చేసిందని గుర్తు చేశారు. యువ కవులు రచనలతో తెలంగాణ సాహిత్యం వందల ఏళ్లు వర్ధిల్లుతుందనే అన్ని భాషల్లో యువ కవి సమ్మేళనం నిర్వహించామన్నారు. 35 ఏళ్ల లోపు కవులు ఈ సమ్మేళనంలో పాల్గొని కవితా గానం చేశారని తెలిపారు. కేసీఆర్ దిక్సూచీలా, దారిదీపంలా నిలబడి ఉద్యమ దిశానిర్దేశం చేశారని.. ఆయన సాగించిన పోరాటాలు, వందలాది మంది త్యాగాలతో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్న రోజు ఈ రోజు అన్నారు.

## స్వల్ప నష్టాల్లో ముగిసిన మార్కెట్లు..



ముంబై: వారంలో తొలిరోజు దేశీయ స్టాక్ మార్కెట్ నష్టాల్లో ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ప్రతికూల ప్రభావం దేశీయ మార్కెట్లపై సైతం పడింది. సోమవారం ట్రేడింగ్ ప్రారంభంలో మార్కెట్ భారీగా నష్టపోయినా.. ఆ తర్వాత స్వల్పంగా మెరుగపడ్డాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 81,214.42 నష్టాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 80,654.26 పాయింట్ల కనిష్టాన్ని తాకిన సెన్సెక్స్.. అత్యధికంగా 81,474.26 పాయింట్లకు పెరిగింది. చివరకు 77.26 పాయింట్ల నష్టంతో 81,373.75 వద్ద ముగిసింది. నిఫ్టీ 34.10 పాయింట్లు పతనమై.. 24,716.60 వద్ద స్థిరపడింది.

ట్రేడింగ్‌లో దాదాపు 2,065 షేర్లు లాభపడగా.. 1,903 షేర్లు పతనమయ్యాయి. అదానీ పోర్ట్స్, ఎం అండ్ ఎం, ఎటర్నల్, టాటా కన్స్యూమర్, పవర్ గ్రిడ్ కార్ప్ నిఫ్టీలో లాభాలను ఆర్జించాయి. హీరో మోటోకార్ప్స్, టెక్ మహీంద్రా, జెఎస్‌డబ్ల్యు స్టీల్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, టాటా స్టీల్ తదితర సంస్థలు నష్టపోయాయి. పీఎస్‌యూ బ్యాంక్, రియాల్టీ ఒక్కొక్కటి 2 శాతం లాభపడ్డాయి. కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఐటీ, మెటల్ సూచీలు ఒక్కొక్కటి 0.5 శాతం తగ్గాయి. బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.6 శాతం పెరిగింది. స్మాల్ క్యాప్ ఇండెక్స్ 0.4 శాతం వృద్ధిని నమోదు చేసింది.

## రూ.2వేల నోట్లపై రిజర్వ్ బ్యాంక్ కీలక ప్రకటన




న్యూఢిల్లీ: రూ.2వేల నోట్లపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సోమవారం కీలక ప్రకటన చేసింది. వెనక్కి తీసుకున్న రూ.2వేల నోట్ల ఇంకా పూర్తిస్థాయిలో రిజర్వ్ బ్యాంక్‌కు చేరలేదని పేర్కొంది. ప్రస్తుతం రూ.6,181 కోట్ల విలువైన నోట్లు ఇంకా ప్రజల వద్దే ఉన్నాయని పేర్కొంది. నోట్ల రద్దు తర్వాత రిజర్వ్ బ్యాంక్ 2016 నవంబర్ 8న రూ.2వేల నోట్లను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. బ్లాక్ మనీ, అవినీతి, నకిలీ కరెన్సీకి బ్రేకులు వేసేందుకు కేంద్ర నోట్లను రద్దు చేసిన విషయం తెలిసిందే. నోట్ల రద్దుతో వచ్చే కరెన్సీని కొరతను అధిగమించేందుకు ప్రభుత్వం రూ.2వేల నోట్లను తీసుకువచ్చింది. మహాత్మా గాంధీ సిరీస్ నోట్లలో భాగంగా అత్యాధునిక సెక్యూరిటీ ఫీచర్లతో నోట్లను విడుదల చేసింది.

దేశ అవసరాలకు సరిపడా ఇతర డినామినేషన్‌ల కరెన్సీ నోట్లు అందుబాటులో ఉండటంతో ప్రభుత్వం రూ.2వేల నోట్లను 19 మే 2023న ఆర్‌బీఐ రూ.2వేల నోట్లను చెలామణి నుంచి ఉపసంహరించుకుంటున్నట్లు ఆర్‌బీఐ ప్రకటించింది. వెనక్కి తీసుకున్న సమయంలో చెలామణిలో రూ.3.56లక్షల విలువ రూ.2వేల నోట్లు ఉన్నాయి. ఆ తర్వాత రూ.2000 నోట్లు మార్చుకునేందుకు ఆర్‌బీఐ అవకాశం కల్పించింది. బ్యాంకుల్లో మార్చుకునే అవకాశం 2023 అక్టోబర్ 7 వరకు ఛాన్స్ ఇచ్చింది. అయితే, ఆర్‌బీఐ ఆఫీసుల్లో ఈ నోట్లను మార్చుకుని తమ అకౌంట్లల్లో డిపాజిట్ చేసుకునే అవకాశం ఇప్పటికీ అవకాశం ఉందని.. దేశవ్యాప్తంగా ఉన్న 19 ఆర్‌బీఐ కేంద్ర కార్యాలయాల్లో ఈ సదుపాయం అందుబాటులో ఉందని చెప్పింది. ప్రజలు తమ వద్ద ఉన్న నోట్లను రూ.2వేల నోట్లను పోస్టాఫీసుల్లోనూ మార్చుకోవచ్చని చెప్పింది.

## మళ్లీ తగ్గిన బంగారం ధర



న్యూఢిల్లీ: దేశంలో సోమవారం 24 క్యారెట్ల బంగారం ధర ఒక గ్రాము రూ. 9,730లుగా ఉంది. అదే 22 క్యారెట్ల గోల్డ్ రేట్ గ్రాముకు రూ.8,919లు కాగా, 18 క్యారెట్ల బంగారం ధర ఒక గ్రాము రూ.7,298లు పలుకుతోంది. అయితే, మీరు బంగారం కొనాలని అనుకున్నట్లయితే ఈ రోజు ధరలు తెలుసుకోవడం అనేది అత్యవసరం. కనుక ఏయే నగరాలు, పట్టణాల్లో గోల్డ్ రేట్స్ ఎలా ఉన్నాయో తెలుసుకొని మీ షాపింగ్ ప్లాన్ చేసుకోవచ్చు.

బంగారం, వెండి ధరలు స్వల్పంగా తగ్గాయి. ప్రస్తుతం తులం బంగారం ధర లక్షకి చేరువలో 97 వేలకి పైగా ట్రేడవుతుంది. గత వారంలో హెచ్చుతగ్గులు చూసిన బంగారం ధర నేటికీ ఎలాంటి మార్పు లేకుండా స్వల్ప తేడాతోనే కొనసాగుతూ వస్తోంది. జూన్ రెండో తేదీ సోమవారం బంగారం ధరలు ఇలా ఉన్నాయి. దేశంలో ఈ రోజు 24 క్యారెట్ల బంగారం ధర ఒక గ్రాము రూ. 9,730లుగా ఉంది. అదే 22 క్యారెట్ల గోల్డ్ రేట్ గ్రాముకు రూ.8,919లు కాగా, 18 క్యారెట్ల బంగారం ధర ఒక గ్రాము రూ.7,298లు పలుకుతోంది. అయితే, మీరు బంగారం కొనాలని అనుకున్నట్లయితే ఈ రోజు ధరలు తెలుసుకోవడం అనేది అత్యవసరం. కనుక ఏయే నగరాలు, పట్టణాల్లో గోల్డ్ రేట్స్ ఎలా ఉన్నాయో తెలుసుకొని మీ షాపింగ్ ప్లాన్ చేసుకోవచ్చు.

ఢిల్లీలో 10 గ్రాముల 22 క్యారెట్ల పసిడి ధర రూ.89,340, 24 క్యారెట్ల ధర రూ.97,450 గా ఉంది. ముంబైలో 22 క్యారెట్ల ధర రూ.89,190, 24 క్యారెట్ల ధర రూ.97,300 గా ఉంది. చెన్నైలో 22 క్యారెట్ల ధర రూ.89,190, 24 క్యారెట్ల రేటు రూ.97,300 గా ఉంది. బెంగళూరులో 22 క్యారెట్ల ధర రూ.89,190, 24 క్యారెట్ల ధర రూ.97,300 గా ఉంది. హైదరాబాద్‌లో 22 క్యారెట్ల బంగారం ధర రూ.89,190, 24 క్యారెట్ల ధర రూ.97,300 గా ఉంది. వరంగల్‌లో 22 క్యారెట్ల బంగారం ధర రూ.89,190, 24 క్యారెట్ల ధర రూ.97,300 గా ఉంది. ఖమ్మంలోనూ 22 క్యారెట్ల బంగారం ధర రూ.89,190, 24 క్యారెట్ల ధర రూ.97,300 గా ఉంది. నిజామాబాద్‌లో 22 క్యారెట్ల బంగారం ధర రూ.89,190, 24 క్యారెట్ల ధర రూ.97,300 గా ఉంది. విశాఖపట్నంలో 22 క్యారెట్ల బంగారం ధర రూ.89,190, 24 క్యారెట్ల ధర రూ.97,300 గా ఉంది. విజయవాడలో 22 క్యారెట్ల బంగారం ధర రూ.89,190, 24 క్యారెట్ల ధర రూ.97,300 గా ఉంది. భారతదేశం-నేటి వెండి ధర గ్రాము రూ.110.80లు కాగా, కిలో వెండి ధర రూ.1,10,800లుగా ఉంది.

# ఐపీఎల్ ఫైనల్‌కు వానగండం..!

### మళ్లీ ఆ సీన్ రిపీట్ అవుతుందా..?
### అదే జరిగితే ఆర్‌సీబీకి టైటిల్ ఛాన్స్ లేనట్లే..!




అహ్మదాబాద్: ఐపీఎల్-2025 సీజన్ ముగింపు దశకు చేరింది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో మంగళవారం జరిగే ఫైనల్‌తో ముగియనున్నది. రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, పంజాబ్ కింగ్స్ జట్లు టైటిల్ కోసం పోటీపడుతున్నాయి. ఐపీఎల్ ప్రారంభమైనప్పటి నుంచి ఆర్‌సీబీ, పంజాబ్ జట్లు ఇప్పటి వరకు టైటిల్‌ను గెలువని విషయం తెలిసిందే. రెండు జట్లలో ఏదో ఒక జట్టు తొలిసారి చాంపియన్‌గా నిలువబోతున్నది. పంజాబ్, ఆర్‌సీబీ గ్రూప్ దశలో తొలి రెండుస్థానాల్లో నిలిచి ప్లేఆఫ్స్‌కు చేరి.. ఫైనల్‌లో తలపడబోతున్నాయి. ఈ సీజన్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో ఆర్‌సీబీ తొలి మ్యాచ్‌లో విజయం సాధించింది. ఈ సీజన్‌లో ఆర్‌సీబీ, పంజాబ్ జట్లు అద్భుత ప్రదర్శన చేసి గ్రూప్ దశలో తొలి రెండుస్థానాల్లో నిలిచాయి. గ్రూప్ దశను ముగిసే సరికి పాయింట్ల పట్టికలో పంజాబ్ కింగ్స్ అగ్రస్థానంలో ఉండగా.. ఆర్‌సీబీ రెండోస్థానంలో నిలిచింది.

ఆర్‌సీబీ-పంజాబ్ జట్లు 2021లో అహ్మదాబాద్‌తో ఓ మ్యాచ్‌లో తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో పంజాబ్ గెలిచింది. అయితే, క్వాలిఫయర్-1 మ్యాచ్‌లో పంజాబ్‌ను ఆర్‌సీబీ ఓడించి ఫైనల్‌కు చేరింది. క్వాలిఫయర్-2 మ్యాచ్‌లో ముంబయిపై విజయంతో పంజాబ్ ఫైనల్‌కు చేరుకుంది. మంగళవారం అహ్మదాబాద్ వేదికగా ఫైనల్ జరుగున్నది. పంజాబ్-ముంబయి మధ్య ఆదివారం జరిగిన క్వాలిఫయర్-2 మ్యాచ్‌కు వర్షం ఆటంకం కలిగించింది. వర్షం కారణంగా మ్యాచ్ 2.15 గంటలు ఆలస్యంగా మొదలైంది. అదనపు సమయం కేటాయించడంతో పూర్తిస్థాయిలో మ్యాచ్‌ని నిర్వహించారు. అయితే, ఫైనల్ మ్యాచ్‌కు వర్షం అంతరాయం కలిగిస్తుందా? అని అభిమానులు ఆందోళనకు గురవుతున్నారు.

వాతావరణశాఖ నివేదిక ప్రకారం.. ఫైనల్ రోజున అహ్మదాబాద్‌లో వర్షం కురిసేందుకు అవకాశాలున్నాయి. వర్షం కురవడంతో పాటు ఆకాశం మేఘావృతమై ఉంటుందని ఐఎండీ అంచనా వేసింది. 2023 సీజన్ ఫైనల్ మ్యాచ్ సైతం అహ్మదాబాద్‌లోనే జరిగింది. ఆ సమయంలోనూ ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్‌కు వర్షం ఆటంకం కలిఇంచింది. ఆ సీజన్‌లో ఫైనల్ మ్యాచ్ మే 28న జరగ్గా.. వర్షం కారణంగా ఒక్క బంతి వేయడం కూడా సాధ్యపడలేదు. టైటిల్ మ్యాచ్ కోసం రిజర్వ్ డే ఉండడంతో ఫైనల్‌ను మరుసటి రోజున నిర్వహించారు. రిజర్వ్ డే రోజున సైతం వర్షం మ్యాచ్‌కు అంతరాయం కలిగించింది. దాంతో మ్యాచ్‌ను 15 ఓవర్లకు కుదించారు. ఈ సీజన్‌లో ఐపీఎల్ ఫైనల్ జూన్ 3న మంగళవారం జరుగనున్నది. వర్షం అంతరాయం కలిగిస్తే.. మళ్లీ బుధవారం నిర్వహించనున్నారు. వర్షం కురిసే అవకాశాలు ఎక్కువగా ఉండడంతో బీసీసీఐ ప్లేఆఫ్, ఫైనల్ మ్యాచ్ సమయం పెంచింది. మ్యాచ్‌ను పూర్తి చేసేందుకు బీసీసీఐ అదనంగా రెండు గంటల సమయం కేటాయించింది.

ఈ మేరకు మ్యాచ్ రాత్రి 9.30 గంటలకు ప్రారంభమైతే ఓవర్లు కుదించకుండానే మ్యాచ్ జరుగుతుంది. ఐదు ఓవర్ల మ్యాచ్‌కు కటాఫ్ సమయం రాత్రి 11.56 గంటలు కాగా.. ఆ సమయానికి కూడా మ్యాచ్ జరుగకపోతే మ్యాచ్‌కు రిజర్వ్ డే ఉంటుంది. రిజర్వ్ డే రోజున మ్యాచ్ పూర్తిస్థాయిలో నిర్వహించడం సాధ్యం కాకపోతే రెండు జట్లు సూపర్ ఓవర్ ఆడిస్తారు. సూపర్ ఓవర్ అత్యధిక పరుగులు చేసిన జట్టు చాంపియన్‌గా నిలుస్తుంది. ఈ సూపర్ ఓవర్‌కు సైతం అదనంగా 20 నిమిషాల సమయాన్ని అదనంగా కేటాయించింది. అంటే సూపర్ ఓవర్ రాత్రి 12.30 గంటలకు సైతం నిర్వహించేందుకు అవకాశం ఉంది. అప్పటి వరకు కూడా సూపర్ ఓవర్ నిర్వహించడం సాధ్యం కాకపోతే ఫైనల్ మ్యాచ్ రద్దవుతుంది. పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉన్న పంజాబ్ విజేతగా నిలుస్తుంది.

## చికెన్‌గున్యా ఎఫెక్ట్.. ఎమర్జింగ్ ఆసియా కప్ వాయిదా..!



న్యూఢిల్లీ: మరో నాలుగు రోజుల్లో ప్రారంభం కావాల్సిన మహిళల ఎమర్జింగ్ ఆసియా కప్ వాయిదా పడింది. షెడ్యూల్ ప్రకారం శ్రీలంక వేదికగా జూన్ 6 నుంచి టోర్నీ మొదలవ్వాల్సింది. కానీ, హఠాత్తుగా టోర్నీని నిలిపివేస్తున్నట్టు ఆసియా క్రికెట్ కౌన్సిల్ సోమవారం వెల్లడించింది. అసలు కారణం ఏంటంటే..? శ్రీలంకలో వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేవు.

ఈ విషయాన్ని ఆ దేశ క్రికెట్ అధ్యక్షుడు షమ్మీ సిల్వా ఏసీసీ దృష్టి కి తీసుకువచ్చాడు. దాంతో, క్రికెటర్ల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని టోర్నీని వాయిదా వేయాలని ఏసీసీని ఆయన అభ్యర్థించారు. సో.. కొన్ని రోజులు నిర్ణయం తీసుకుంది. అయితే.. కొత్త షెడ్యూల్‌ను ఎప్పుడు ప్రకటిస్తారు? అనేది మాత్రం తెలియడం లేదు. 'మా దేశంలో ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా లేదు. పైగా చికెన్‌గున్యా కేసులు పెరుగుతున్నాయి.

ఈ పరిస్థితుల్లో మహిళల ఎమర్జింగ్ టీమ్స్ ఆసియా కప్ నిర్వహణ సవాల్‌గా మారనుంది. అందుకే.. కొన్ని రోజులు టోర్నీని వాయిదా వేయాలని ఏసీసీకి విజ్ఞప్తి చేస్తూ లేఖ రాశాను' అని శ్రీలంక క్రికెట్ అధ్యక్షుడు షమ్మీ సిల్వా వెల్లడించాడు. ఆయన లేఖ అందిన తర్వాత క్రికెటర్ల ఆరోగ్యమే తమ తొలి ప్రాధాన్యమంటూ టోర్నీని నిలిపి వేస్తున్నట్టు తెలిపింది.

'యువ మహిళా క్రికెటర్లు తమ నైపుణ్యాలను మెరుగు పరచుకునేందుకు ఏసీసీ అవకాశాలు కల్పిస్తుంది. ఆసియాలో మహిళా క్రికెట్ గతిని మార్చడంలో ఎమర్జింగ్ టీమ్స్ ఆసియా కప్ ఎంతో ఉపకరిస్తుంది. అయితే.. శ్రీలంకలో పరిస్థితుల గురించి తెలిశాక టోర్నీని వాయిదా వేయడమే సరైన నిర్ణయమని భావించాం. వీలైనంత త్వరగా కొత్త షెడ్యూల్‌ను విడుదల చేస్తాం 'అని ఏసీసీ చీఫ్ మొహ్సిన్ నఖ్వీ తెలిపాడు.

### భారత్ తొలి ఛాంపియన్

మహిళల ఎమర్జింగ్ టీమ్స్ ఆసియా కప్‌ను 2023లో తొలిసారి నిర్వహించారు. ఆ టోర్నీలో ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టిన భారత ఏ జట్టు జయకేతనం ఎగురవేసింది. ఉత్కంఠ రేపిన ఫైనల్లో బంగ్లాదేశ్ ఏ జట్టుపై 31 పరుగుల తేడాతో గెలుపొంది ట్రోఫీని కైవసం చేసుకుంది.

## సెప్టెంబర్ 30 నుంచి మహిళల వరల్డ్ కప్..




న్యూఢిల్లీ: ఐపీఎల్ మజాను ఆస్వాదిస్తున్న అభిమానులకు మరో గుడ్‌న్యూస్. మహిళల వన్డే వరల్డ్ కప్ షెడ్యూల్ విడుదలైంది. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఈ టోర్నీ సెప్టెంబర్ 30న మొదలు కానుంది. ఇరుదేశాల్లో మెగా టోర్నీ జరిపేందుకు ఐసీసీ సన్నాహకాలు చేపట్టిన ఐసీసీ సోమవారం షెడ్యూల్‌ను ప్రకటించింది. ఇరుదేశాల్లో ఐదు వేదికలపై 13వ ఎడిషన్ వరల్డ్ కప్ మ్యాచ్‌లు ఉంటాయని తెలిపింది.

ఈసారి టైటిల్ కోసం ఎనిమిది జట్లు పోటీ పడుతున్నాయి. భారత్, శ్రీలంక, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, బంగ్లాదేశ్, పాకిస్థాన్‌లు నువ్వానేనా అన్నట్టు తలపడనున్నాయి. సెప్టెంబర్ 30న జరుగబోయే ఆరంభ పోరులో బంగ్లాదేశ్‌తో భారత జట్టు తలపడనుంది. తొలి సెమీ ఫైనల్ అక్టోబర్ 29న గువాహటి లేదా కొలంబోలో, రెండో సెమీస్ అక్టోబర్ 30న బెంగళూరులో జరుగుతాయి. రెండు రోజుల విరామం అనంతరం నవంబర్ 2న జరుగబోయే ఫైనల్‌తో విజేత ఎవరో తేలిపోనుందని ఐసీసీ చెప్పింది.

### భారత్‌కు నాలుగు.. లంకకు ఒకటి

వరల్డ్ కప్ పోటీలకు భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్నాయి. అయితే.. సింహభాగం మ్యాచ్‌లు ఇండియాలోనే జరుగున్నాయి. దాదాపు 12 ఏళ్ల తర్వాత మహిళల వరల్డ్ కప్ టోర్నీకి భారత్ ఆతిథ్యం ఇస్తోంది. కాబట్టి ఐసీసీ.. ఇండియాలోని నాలుగు స్టేడియాల్లో.. లంకలోని ఒక స్టేడియంలో మ్యాచ్‌ల నిర్వహణకు ఆమోదం తెలిపింది.

మన దేశంలోని చిన్నస్వామి స్టేడియం (బెంగళూరు), ఏసీఏ స్టేడియం(గువాహటి), హోల్కర్ మైదానం(ఇండోర్), ఏసీఏ-వీడీసీఏ స్టేడియం(విశాఖపట్టణం)లో వరల్డ్ కప్ మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. శ్రీలంక విషయానికొస్తే.. కొలంబోలోని ఆర్.ప్రేమదాస స్టేడియం మెగా టోర్నీ మ్యాచ్‌లకు వేదిక కానుంది. 2022లో విజేతగా నిలిచిన ఆస్ట్రేలియా డిఫెండింగ్ ఛాంపియన్‌గా అడుగుపెట్టనుంది.

## ముగింపు వేడుకల్లో స్వరమాంత్రికుడు..

### 'ఆపరేషన్ సింధూర్'ను ప్రతిబింబించే గీతాలు..!

న్యూఢిల్లీ: ఐపీఎల్‌లో కొత్త ఛాంపియన్ అవతరించే సమయం వచ్చేసింది. తొలి టైటిల్ కోసం నిరీక్షిస్తున్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, పంజాబ్ కింగ్స్‌ల మధ్య ఫైనల్ ఫైట్ జరుగనుంది. సో.. మంగళవారం నరేంద్ర మోడీ స్టేడియంలో రెండు జట్లు టైటిల్ కోసం సర్వ శక్తులు ఒడ్డడం ఖాయం. కాబట్టి.. మ్యాచ్ కంటే ముందు ముగింపు వేడుకల్ని అట్టహాసంగా జరపాలని బీసీసీఐ, ఐపీఎల్ నిర్వాహకులు భావిస్తున్నారు. ఆనవాయితీ ప్రకారం సెలబ్రిటీ గాయకులను రప్పించి.. వాళ్లతో ప్రదర్శన ఏర్పాటు చేయనున్నారు. ఈసారి బాలీవుడ్ సింగర్ శంకర్ మహదేవన్ క్లోజింగ్ సెరమోనీ కచేరీకి నేతృత్వం వహించనున్నాడు.

ఐపీఎల్ ఫైనల్‌ను వీక్షించేందుకు భారత త్రివిధ దళాధిపతులు ఫైనల్‌కు విచ్చేయన్నారు. ఈ నేపథ్యంలో ముగింపు వేడుకల్లో 'ఆపరేషన్ సిందూర్', దేశ భక్తిని ప్రతిబింబించే పాటలకు ప్రాధాన్య ఇవ్వాలని బీసీసీఐ భావించింది. అందుకే.. స్వర మాంత్రికుడు శంకర్ మహదేవన్‌ను పురమాయించింది భారత బోర్డు. మంగళవారం ఆయన తన కుమారులు శివం మహదేవన్, సిద్ధార్థ్ మహదేవన్‌లతో కలిసి దేశభక్తి పాటలు ఆలపించనున్నాడు.






భారత సైనికుల ధైర్య సాహసాలను కీర్తిస్తూ సాగే ఈ కార్యక్రమం కోసం స్టేడియాన్ని తిరంగా థీమ్‌తో ముస్తాబు చేయనున్నారు నిర్వాహకులు. పలు చోట్ల మువ్వన్నెల జెండాలు, లైట్స్ వంటివి ఏర్పాటు చేస్తున్నారు. మొత్తానికి నరేంద్ర మోడీ స్టేడియం రేపు ఇటు దేశభక్తి గీతాలతో, అటు క్రికెట్ మజాతో సందడిగా సాగనుంది.

### ఎవరు గెలిచినా చరిత్రే

లీగ్ దశ నుంచి టైటిల్ గెలవాలనే కసితో ఆడిన రెండు జట్ల మధ్య అంతిమ సమరం జరుగనుంది. ప్లే ఆఫ్స్‌లో బలమైన జట్లకు చెక్ పెట్టిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, పంజాబ్ కింగ్స్ టైటిల్ పోరులో అమీతుమీకి సిద్ధమయ్యాయి. ఆర్సీబీకి ఇది నాలుగో ఫైనల్ కాగా.. పంజాబ్‌కు ఇది రెండోది. ఇప్పటివరకూ విజేతగా నిలవని ఈ రెండు టీమ్‌లు ఇప్పుడు తమ కలల ట్రోఫీకి అడుగు దూరంలో నిలిచాయి. ఇరుజట్లు లీగ్ దశలో ఎదురుపడిన రెండు మ్యాచుల్లో చెరొకటి గెలిచాయి.

అయితే.. క్వాలిఫయర్ 1లో ఆర్సీబీ బౌలర్ల ధాటికి పంజాబ్ 101 పరుగులకే ఆలౌటయ్యింది. స్వల్ప లక్ష్యాన్ని బెంగళూరు 10 ఓవర్లలోనే ఆడుతూ పాడుతూ ఛేదించింది. అనంతరం క్వాలిఫయర్ 2లో ముంబై ఇండియన్స్‌ను మట్టికరిపించిన పంజాబ్.. కప్ వేటలో ఉన్న ఆర్సీబీకి షాక్ ఇవ్వాలనుకుంటోంది. అయితే.. ఇద్దరిలో ఎవరు విజేతగా నిలిచినా కొత్త ఛాంపియన్‌గా చరిత్ర సృష్టించడంఖాయం.



# వీరమల్లు ట్రైలర్ కోసం ఆత్రుత

టాకీస్: పవన్ కల్యాణ్ హరిహర వీరమల్లు కోసం ఫ్యాన్స్ ఎంతగానో వెయిట్ చేస్తున్నారు. అనేక వాయిదాల తర్వాత జూన్ 12న మూవీ రిలీజ్ చేస్తున్నారు. కానీ ఇంకా ప్రమోషన్లు స్టార్ట్ చేయలేదు. ట్రైలర్ విడుదల కోసం ఫ్యాన్స్ నుంచి ఒత్తిడి వస్తోంది. ఇంకా పది రోజులే ఉంది.. ఇంకెప్పుడు రిలీజ్ చేస్తారంటూ ఫ్యాన్స్ ఒకింత అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నిర్మాత ఏఎం రత్నం ట్రైలర్ రిలీజ్ డేట్ మీద క్లారిటీ- ఇచ్చారు. ఫ్యాన్స్ ఆవేదన నాకు తెలుసు. వారు ఎంతగానో వెయిట్ చేస్తున్నారు. కానీ సెకండ్ హాఫ్ లో సీజీ వర్క్ చాలా పెండింగ్ ఉంది. ఆ పనులు స్పీడ్ గా సాగుతున్నాయి. అతి త్వరలోనే వాటిని కంప్లీట్ చేసి రిలీజ్ చేస్తాం అన్నారు ఆ పనులన్నింటినీ దృష్టిలో పెట్టుకునే సినిమా రిలీజ్ డేట్ ను ప్రకటించాం. పోస్ట్ ప్రొడక్షన్ పనులకు టైమ్ పడుతుంది' అంటూ నిర్మాత చెప్పారు. చూస్తుంటే రెండు మూడు రోజుల్లో ట్రైలర్ రిలీజ్ చేసే అవకాశాలు ఉన్నాయి. పవన్ కల్యాణ్ కూడా ప్రమోషన్లలో పాల్గొనేందుకు డేట్స్ కేటాయించాడంట. రెండు కీలక ఇంటర్వ్యూలు, మూడు భారీ ఈవెంట్లు ప్లాన్ చేస్తున్నట్టు- తెలుస్తోంది. పాన్ ఇండియా స్థాయిలో వస్తున్న ఈ సినిమా కోసం తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా ఇతర రాష్ట్రాల్లో కూడా ఈవెంట్లు ప్లాన్ చేస్తున్నారని టాక్.

# మీ నెగెటివ్ ప్రచారం నా సినిమాను ఆపలేవు

## నా అభిమానులంతా నా వెంటే ఉన్నారు

## నటుడు ధనుష్ ఆవేశ పూరతి స్పీచ్

టాకీస్: 'కుబేర'తో బాక్సాఫీసు వద్ద సందడి చేసేందుకు సిద్ధమయ్యారు నటుడు ధనుష్ . ఆయన, నాగార్జున కలిసి నటించిన చిత్రం 'కుబేర'. ఈ పాన్ ఇండియా చిత్రాన్ని శేఖర్ కమ్ముల తెరకెక్కించారు. రష్మిక కథానాయికగా నటించారు. ఇది జూన్ 20న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా తాజాగా చెన్నైలో ఆడియో లాంచ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఇందులో ధనుష్ పవర్‌ఫుల్ స్పీచ్‌తో అభిమానుల్లో ఉత్సాహాన్ని



నింపారు. నేనెప్పుడు నా బెస్ట్ ఇవ్వడానికే ప్రయత్నం చేస్తుంటాను. నాపై, నా సినిమాలపై ఎంత నెగెటివ్ ప్రచారం చేస్తారో చేసుకోండి. నా సినిమాల విడుదలకు ముందు నెలకు రెండుసార్లు ఏదోఒక విషయంలో కుట్రలు చేస్తూనే ఉంటారు. అయినా మీరేం చేయలేరు. ఎందుకంటే నా అభిమానులు ఎప్పుడూ నాతో ఉన్నారు. ఇలాంటి సర్కస్‌లు మానుకోండి. ఇక్కడ ఉన్నవారంతా నా అభిమానులు మాత్రమే కాదు.. వీరంతా 23 సంవత్సరాలుగా నా వెంటే ఉంటు-న్నారు. మీరెంత నెగెటివి ప్రచారం చేసినా వీరంతా ఎప్పటికీ నాతోనే ఉంటారని ధనుష్ పవర్‌ఫుల్ స్పీచ్‌తో అదరగొట్టారు. ఇక అభిమానులను ఉద్దేశిస్తూ సంతోషం ఎప్పుడూ మనలోనే ఉంటుందని దాన్ని బయట వెతుక్కోవద్దని సూచించారు. ఆనందంగా జీవించాలని మనం బలంగా కోరుకోవాలి. అది మనలోనే.. మనతోనే ఉంటుంది. నా వరకూ నేను మంచి భోజనం చేసి సంతోషిస్తాను. అదే నాకు ఆనందం. మన సంతోషానికి మించింది ఏమీ ఉండదని తెలిపారు. ఇక ఇదే ఈవెంట్‌లో దర్శకుడు శేఖర్ కమ్ముల మాట్లాడుతూ.. ధనుష్ నటనపై ప్రశంసలు కురిపించారు. 'కుబేర'లో ఈ పాత్ర ధనుష్ కాకుండా మరెవ్వరూ చేయలేరన్నారు. అద్భుతంగా నటించారని.. నేషనల్ అవార్డు కచ్చితంగా వస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. అలాగే ధనుష్ దర్శకత్వంలో నటించాలనుందని నాగార్జున అన్నారు. అతను గొప్ప నటు-డని ప్రశంసించారు. ఇంత గొప్ప చిత్రంలో భాగమైనందుకు ఎంతో గర్వంగా ఉందని రష్మిక తెలిపారు. ఈ కథ తనకెంతో నచ్చిందన్నారు.




# ఖరీదైన వస్తువులకు నేను దూరం: మృణాల్

టాకీస్: మనకు తెలిసి సెలబ్రిటీల లైఫ్ అంటే లగ్జరీ గుర్తుకు వస్తుంది. వారు మామూలుగా చిన్న చిన్న బ్రాండ్స్ వాడారు. అన్ని బ్రాండెడ్ వస్తువులనే ఎక్కువగా వాడుతుంటారు. కాస్ట్లీ వాచ్‌లు, కారులు, బట్టలు ఇలా ప్రతి ఒక్కటి లక్షల్లోనే ఉంటాయి. ఆ మధ్య త్రిష ఈవెంట్లకు రెండు లక్షల డ్రెస్ వేసుకొచ్చింది. అయితే మృణాల్ మాత్రం ఇందుకు భిన్నంగా ఉంటుందట.. 'సీతారామం' సినిమా ద్వారా పరిచయమైన ఈ హీరోయిన్ ఆ తర్వాత 'హాయ్ నాన్న' చిత్రంతో మంచి విజయం అందుకుంది. ప్రస్తుతం పాత్రలకు ప్రాధాన్యత ఉన్న చిత్రాలు ఎంచుకుంటూ దూసుకుపోతుంది. అయితే..తాజాగా ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. తనకి డ్రస్సుల పైన ఎక్కువ డబ్బులు ఖర్చు పెట్టడం ఇష్టం ఉండదని.. ఇప్పటివరకు కొన్ని నా ఖరీదైన డ్రెస్ కేవలం 2000 అని చెప్పకొచ్చింది. ఇద్దంతా నమ్మశక్యంగా లేదు కదా.. ఎందుకంటే ఈ మధ్య కాలంలో నార్మల్ పీపులే వేలకు వేల డ్రేస్‌లు వేసుకుంటున్నారు. ఒక స్టార్ హీరోయిన్ అయి ఉండి ఇలా మాట్లాడటం చూసి.. 'ఈ హీరోయిన్ ఇంత పొదుపరిలా ఉంది' అని కామెంట్ లో పెడుతున్నారు అభిమానులు. కొంతమంది మాత్రం మృణాల్ చెప్పింది నిజమే అని.. తను డబ్బు విలువ తెలిసి ప్రవర్తిస్తుందని అభినందిస్తున్నారు.

# అందాల నిధి.. ఆశలన్నీ ఆ సినిమా పైనే..

టాకీస్: చాలా కాలం తర్వాత అడియన్స్ ముందుకు రానుంది హీరోయిన్ నిధి అగర్వాల్. ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ ఆశలన్నీ ఆ సినిమా పైనే ఉన్నాయి. తాజాగా సోషల్ మీడియాలో ఈ వయ్యారి షేర్ చేసిన ఫోటోస్ తెగ వైరలవుతున్నాయి. తెలుగు సినీప్రియులకు నిధి అగర్వాల్ ప్రత్యేకంగా పరిచయం అవసరంలేదు. టాలీవుడ్ ఇండస్ట్రీలో నటిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న నిధి అగర్వాల్.. ప్రస్తుతం సరైన బ్రేక్ కోసం ఎదురుచూస్తుంది. ఇప్పటివరకు ఈ అమ్మడు నటించిన చిత్రాలన్నీ బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్స్ అయిన సంగతి తెలిసిందే.
దీంతో ఈ బ్యూటీకి తెలుగులో అంతగా ఆఫర్స్ రాలేదు. కానీ తమిళంలో మాత్రం వరుస అవకాశాలు అందుకుంది. ఇప్పుడు తెలుగులో ఈ అమ్మడు నటిస్తోన్న లేటెస్ట్ మూవీ హరి హర వీరమల్లు. త్వరలోనే ఈ మూవీ అడియన్స్ ముందుకు రానుంది. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా నటిస్తున్న ఈ సినిమాపైనే నిధి ఆశలు పెట్టుకుంది. ఇప్పటివరకు వరుస డిజాస్టర్స్ అందుకున్న నిధి.. ఇప్పుడు భారీ హిట్టు కోసం వెయిట్ చేస్తుంది. ఇప్పటికే హరి హర వీరమల్లు సినిమాపై భారీ హైప్ నెలకొంది. మరోవైపు సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటుంది నిధి. తాజాగా ఈ అమ్మడు షేర్ చేసిన ఫోటోస్ తెగ వైరలవుతున్నాయి. అలాగే ఇటీవల తన ప్రేమ, పెళ్లి గురించి వస్తున్న రూమర్స్ పై గట్టిగానే రియాక్ట్ అయ్యింది. సినిమాల్లో నటించే హీరోయిన్స్ గురించి చాలా రూమర్స్ వస్తాయని.. ముఖ్యంగా పర్సనల్ లైఫ్ మీదనే ఎక్కువగా ఫోకస్ చేస్తుంటారని.. ఏది అనిపిస్తే దాన్ని బయటకు అనేస్తారని.. ఇదంచా చాలా కామన్ అని అన్నారు.




# కమల్ క్షమాపణలు చెప్పేవరకు థగ్‌లైఫ్ ఆపాల్సిందే

## కర్ణాటక ఫిలిం బాడీ హెచ్చరికలు

టాకీస్: కమల్ హాసన్ తన కొత్త సినిమా థగ్ లైఫ్ కర్ణాటకలో విడుదల కష్టంగానే ఉంది. ఆయన క్షమాపణ చెబితే తప్ప విడుదలకు అంగీకరించమని అక్కడి సినీ వర్గాలు హెచ్చరించాయి. కన్నడ తమిళం నుంచి పుట్టిందని కామెంట్స్ చేయడం వివాదానికి కారణమైంది. కర్ణాటకలోని ప్రజలు, పలు సంఘాలు కమల్ హాసన్ తీరును తప్పుపట్టాయి. ఆయన సినిమా విడుదలకు అనుమతించబోమని హెచ్చరించాయి. కమల్ హాసన్ తన వ్యాఖ్యలకు క్షమాపణలు చెప్పకుంటే, ఆయన సినిమా థగ్ లైఫ్‌ని రాష్ట్రంలో విడుదలకు అనుమతించ బోమని కర్ణాటక ఫిలిం బాడీ హెచ్చరించింది. ఆయన క్షమాపణ చెప్పకపోతే, థగ్ లైఫ్ కర్ణాటకను నడవదు. ఇది ఇండస్ట్రీ గురించి కాదు, ఇది రాష్ట్రం గురించి. రాజకీయ పార్టీలు కూడా వ్యతిరేకిస్తున్నాయి, కన్నడ అనుకూల సంస్థలు ఆయన స్పందించాల్సిందేనని స్పష్టం చేస్తున్నాయి. ఆయన క్షమాపణ లేకుండా సినిమా విడుదల కష్టం. మా ఎగ్జిబిటర్స్, డిస్ట్రిబ్యూటర్స్ కమల్ హాసన్ సినిమాను ప్రదర్శించేందుకు సిద్ధంగా లేరు. ఈ సినిమా ఇక్కడ ఎలా విడుదల అవుతుందని కర్ణాటక ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఎం. నరసింహలు అన్నారు.కమల్ హాసన్ చేసిన వ్యాఖ్యలు కన్నడ నాట తీవ్ర వివాదంగా మారాయి. అధికార కాంగ్రెస్‌తో పాటు బీజేపీ నేతలు కూడా కమల్ హాసన్



తీరును తప్పుపడుతున్నారు. కర్ణాటక సీఎం సిద్ధరామయ్య మాట్లాడుతూ.. కన్నడకు సుదీర్ఘ చరిత్ర ఉందని, అది కమల్ హాసన్‌కి తెలియదని అన్నారు. బీజేపీ స్టేట్ చీఫ్ బీవై విజయేంద్ర క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. మరోవైపు, తనకు క్షమాపణ చెప్పే ఆలోచన లేదని కమల్ హాసన్ స్పష్టం చేశారు. తాను తప్పు చేశానని అనుకుంటేనే క్షమాపణలు చెబుతానని చెప్పారు.

# నా వ్యాఖ్యలు వక్రీకరిస్తే చేసేదేమీ లేదు: రాజేంద్ర ప్రసాద్

టాకీస్: సీనియర్ నటుడు రాజేంద్రప్రసాద్ నటించిన తాజా చిత్రం 'షష్టిపూర్తి' 'లేడీస్ -టైలర్' విడుదలైన 38 ఏళ్ల తర్వాత ఆయన, అర్చన ప్రధాన పాత్రల్లో ఈ చిత్రంలో నటించారు. పవన్ ప్రభ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా మే 30న ప్రేక్షకుల ముందుకువచ్చింది. తాజాగా ఈ టీమ్ సక్సెస్ మీట్‌ను నిర్వహించింది. అందులో రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. తాను ఎప్పుడూ సరదాగా ఉంటానని అన్నారు. ఇళయరాజా పుట్టినరోజు నాడు ఈ సినిమా సక్సెస్ మీట్ నిర్వహించడం నాకెంతో ఆనందంగా ఉంది. ఆయనకు నేనంటే ఎంతో అభిమానం, ప్రేమ. ఈ మధ్య కొన్ని కార్యక్రమాల్లో నేను మాట్లాడిన మాటలను కొందరు తప్పుగా అర్థం చేసుకున్నారు. అది మీ సంస్కారం మీద ఆధారపడి ఉంటుంది. వాటిని తప్పుగా అర్థం చేసుకోవడం మీ ఖర్మ. నేనైతే ఇలానే ఎప్పుడూ సరదాగానే ఉంటాను. మీడియాను నా కుటుంబంగా భావిస్తాను. నన్ను మీరంతా అన్నయ్య అని పిలవడం నా అదృష్టం అన్నారు. ఈ మధ్య ఓ కార్యక్రమంలో నేను పరిచయం చేసిన హీరోయిన్, యాక్టర్ గురించి సరదాగా మాట్లాడాను. వాటిని తప్పుగా అనుకున్నారు. నేను ఇలానే ఉంటాను. ఎందుకంటే అన్నయ్యను కాబట్టి. పెళ్లిపుస్తకం నుంచి షష్టిపూర్తి వరకూ కెరీర్ సక్సెస్‌ఫుల్‌గా నడిచింది. మీ అందరూ ఈ సినిమాను అదరించినందుకు ధన్యవాదాలు. మనం నటించే సినిమాల్లో మనం కనిపించకూడదు.. పాత్రలే కనిపించాలి. నాతో వర్క్ చేసిన నటీనటులంతా నాతో సరదాగానే ఉంటారు. అందులో తప్పేం లేదు అని రాజేంద్ర ప్రసాద్ చెప్పారు. ఎన్నో భిన్నమైన పాత్రల్లో నటించే అవకాశం వచ్చింది. అది దేవుడిచ్చిన వరం. నిజ జీవితంలో సవాళ్లను ఎలా ఎదుర్కొంటామో.. సినిమాల్లోని పాత్రల్లో వచ్చే వాటిని కూడా ఎదుర్కోవాలి. అది ఆర్టిస్టుల బాధ్యత. షష్టిపూర్తిలో నా బాధ్యతను నిర్వర్తించాను. మీరంతా ఆదరించారు. ఇలాంటి పాత్రలే చివరి శ్వాస వరకూ చేయాలని కోరుకుంటాను. నాపై అభిమానం చూపుతున్న అందరికీ పాదాభివందనం అని తెలిపారు.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.